

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 05-08-2026 | సంపుటి - 31 | సంచిక - 72 | రూ : 4 | పేజీలు: 8


# తెలంగాణ 'పెట్టుబడులకు అనుకూలం'

## భూ లభ్యత, నైపుణ్య మానవ వనరులు, మౌలిక వసతులు ప్రధాన బలాలు

- ప్రతికూలంగా ఆర్థిక, సైబర్ నేరాలు
- దేశవ్యాప్తంగా 13వ స్థానం
- 17 పెద్ద రాష్ట్రాల విభాగంలో 10వ ర్యాంకు
- నీతి ఆయోగ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రెండ్లీనెస్ ఇండెక్స్-2026 నివేదికలో వెల్లడి



హైదరాబాద్: పెట్టుబడులకు అనుకూల రాష్ట్రాల జాబితాలో తెలంగాణ మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది. నీతి ఆయోగ్ ఇటీవల విడుదల చేసిన ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రెండ్లీనెస్ ఇండెక్స్2026 నివేదికలో.. రాష్ట్రం 47.3 పాయింట్లతో దేశవ్యాప్తంగా 13వ స్థానంలో నిలిచింది. 17 పెద్ద రాష్ట్రాల విభాగంలో 10వ ర్యాంకు సాధించింది. పెట్టుబడులకు అనుకూల సూచికల్లో గుజరాత్ (56.6) మొదటి స్థానంలో నిలవగా.. మహారాష్ట్ర (53.7), తమిళనాడు(53.3), గోవా(53.1), ఒడిశా(52.4) రాష్ట్రాలు వరుసగా తర్వాతి స్థానాల్లో నిలిచాయి. దేశంలోని 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాలను ఈ సూచీలో చేర్చారు. మౌలిక సదుపాయాలు, వ్యాపార అనుకూల వాతావరణం, వనరుల లభ్యత, ప్రభుత్వ విధానాలు.. ఇలా 8 ప్రధాన అంశాల ప్రాతిపదికన, మొత్తం 84 సూచికల ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు. ఇందులో ప్రభుత్వ గణాంకాలతో పాటు.. పెట్టుబడిదారుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నారు. **తరువాయి 2లో**



## సీఎస్ బ్రాంచీల్లో

# మిగిలిన సీట్లు 11,660

- **ఈసారి ఇంజినీరింగ్‌లో నిండినవి 80 శాతమే**

హైదరాబాద్: ఇంజినీరింగ్ కళాశాలల్లో మొత్తం 80 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. ఈసారి కంప్యూటర్ సైన్స్, ఐటీ సంబంధిత బ్రాంచీల్లో భారీగా సీట్లు మిగిలిపోయాయి... 82 శాతమే నిండాయి. చివరి విడత సీట్లను మంగళవారం కేటాయించారు. తాజా విడతలో కొత్తగా 3,281 మంది సీట్లు సాధించారు. ఎప్‌సెట్ కౌన్సెలింగ్‌లో కన్వీనర్ కోటా కింద ఈడబ్ల్యూఎస్ సీట్లతో కలుపుకొని 94,156 సీట్లు అందుబాటులో ఉండగా... చివరి విడత నాటికి 75,054 సీట్లు నిండాయి... 19,102 సీట్లు మిగిలిపోయాయి. సీఎస్ఈ, సంబంధిత 19 బ్రాంచీల్లో 66,390 సీట్లుండగా... 54,730 సీట్లు నిండాయి. ఏకంగా 11,660 సీట్లు మిగిలాయి. ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ విభాగంలో **తరువాయి 2లో**

## సరిహద్దులో చైనా శతఘ్నులను మోహరించిన పాకిస్థాన్

# భారత్ గట్టి వార్నింగ్

- జాతీయ ప్రయోజనాల కోసం ఏం చేయడానికైనా సిద్ధమని స్పష్టం చేసిన భారత్

2లో



## అయోధ్య నిధుల కేసులో

# సాధువుల ప్రమేయం లేదు



- సీఎం యోగి ఆదిత్యనాథ్
- సిట్ ప్రాథమిక నివేదికలో ఈ విషయం స్పష్టమైందన్న ముఖ్యమంత్రి
- యూపీ ప్రతిష్టను దెబ్బతీసేందుకే విపక్షాల కుట్ర అని ఆరోపణ

2లో

2లో

## మోదీ పోస్టు తొలగింపు వ్యవహారం.. మెటాను ప్రశ్నించనున్న కేంద్రం

### మెటా ఆల్గారిథమ్ పనితీరుపై వివరణ కోరనున్న కేంద్రం




- మోదీ పోస్టు తొలగింపుపై లిఖితపూర్వక సమాధానానికి డిమాండ్
- ఆగస్టు 5, 6న ఐటీ శాఖతో కీలక సమావేశాలు
- ఇన్‌స్టాగ్రామ్‌లో చిన్నారుల భద్రత అంశం పైనా చర్చ
- ఏఐ మార్ఫింగ్ వీడియోల వ్యవహారం పైనా కొనసాగుతున్న దర్యాప్తు

2లో

## శరవేగంగా...

# ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్



- డిసెంబరులో గ్లోబల్ సమిట్‌లో విడుదలకు సన్నాహాలు
- స్కిల్స్ వర్సిటీలోనే అంతర్జాతీయ సదస్సుకు ఏర్పాట్లు

హైదరాబాద్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న 'భారత్ ఫ్యూచర్ సిటీ' మాస్టర్ ప్లాన్‌ను శరవేగంగా సిద్ధం చేయడంపై దృష్టి పెట్టింది. దీన్ని రూపొందించే బాధ్యతను సింగపూర్‌కు చెందిన అంతర్జాతీయ సంస్థకు అప్పగించింది. ప్రపంచంలోని ఫార్చ్యూన్500 కంపెనీలు భారత్‌లో పెట్టుబడులు పెట్టాలంటే.. తెలంగాణే తొలి గమ్యస్థానం కావాలనే లక్ష్యంతో దీన్ని తీర్చిదిద్దుతున్నారు. ముఖ్యంగా ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టే వారికి అపార అవకాశాలు ఉండేలా వివిధ జోన్ల కింద ప్రత్యేకంగా నిర్మించనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఇప్పటికే పలుమార్లు దీని రూపకల్పనపై సమావేశాలు జరిగాయి. మాస్టర్ ప్లాన్‌కు తుదిరూపునిచ్చి.. డిసెంబరులో నిర్వహించనున్న **తరువాయి 2లో**



## గుజరాత్‌లో చండీపుర వైరస్‌తో

# 22 మంది మృతి

## మాజీ గవర్నర్

# డీవై పాటిల్ కన్నుమూత

- కొల్హాపూర్ లో తుదిశ్వాస విడిచిన డీవై పాటిల్
- వయోభారం వల్ల ఎదురైన అనారోగ్య సమస్యలతో కన్నుమూత
- దేశ విద్యారంగానికి విశేష సేవలు



# తెలంగాణ 'పెట్టుబడులకు అనుకూలం'

హైదరాబాద్: పెట్టుబడులకు అనుకూల రాష్ట్రాల జాబితాలో తెలంగాణ మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది. నీతి ఆయోగ్ ఇటీవల విడుదల చేసిన ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రెండ్లీనెస్ ఇండెక్స్ 2026 నివేదికలో.. రాష్ట్రం 47.3 పాయింట్లతో దేశవ్యాప్తంగా 13వ స్థానంలో నిలిచింది. 17 పెద్ద రాష్ట్రాల విభాగంలో 10వ ర్యాంకు సాధించింది. పెట్టుబడులకు అనుకూల సూచికల్లో గుజరాత్ (56.6) మొదటి స్థానంలో నిలవగా.. మహారాష్ట్ర (53.7), తమిళనాడు(53.3), గోవా(53.1), ఒడిశా(52.4) రాష్ట్రాలు వరుసగా తర్వాతి స్థానాల్లో నిలిచాయి. దేశంలోని 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాలను ఈ సూచీలో చేర్చారు. మౌలిక సదుపాయాలు, వ్యాపార అనుకూల వాతావరణం, వనరుల లభ్యత, ప్రభుత్వ విధానాలు.. ఇలా 8 ప్రధాన అంశాల ప్రాతిపదికన, మొత్తం 84 సూచికల ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు. ఇందులో ప్రభుత్వ గణాంకాలతో పాటు.. పెట్టుబడిదారుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నారు.

*** తెలంగాణకున్న ప్రధాన సానుకూల అంశాలు**

తెలంగాణను పెట్టుబడులకు అత్యంత అనుకూల రాష్ట్రాల్లో ఒకటిగా ఈ నివేదిక గుర్తించింది. టీజీ ఐపాస్ వల్ల 'రెగ్యులేటరీ ఈజ్' విభాగంలో మెరుగైన స్కోరును సాధించింది. 202324లో ఎఫ్‌డీఐ పెట్టుబడులు 3,029.07 మిలియన్ అమెరికన్ డాలర్లు వచ్చాయి.

**1. టీజీ-ఐపాస్ అతిపెద్ద బలం**

పూర్తిస్థాయి ఆన్‌లైన్ అనుమతుల వ్యవస్థ
నిర్ణీత గడువులో అనుమతులు
ఆటోమేటిక్ అనుమతుల విధానం
దేశంలోనే అత్యంత సమర్థమైన సింగిల్ విండో క్లియరెన్స్ వ్యవస్థల్లో ఒకటి
నిర్మాణ అనుమతుల ప్రక్రియను పూర్తిగా డిజిటలైజ్ చేయడం

**2. పరిశ్రమలకు సమృద్ధిగా భూమి లభ్యత**

దేశంలోని ఇతర పెద్ద రాష్ట్రాల సగటుతో పోలిస్తే రాష్ట్రంలో పరిశ్రమలకు కేటాయించడానికి అందుబాటులో ఉన్న భూమి దాదాపు మూడు రెట్లు ఎక్కువగా ఉంది.

**3. పన్నుల ఆదాయం భేష్**

రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం జీఎస్‌డీపీలో 17 శాతం.. దేశ సగటు 9.8 శాతం.
ఈ పరిస్థితుల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ఎక్కువగా ఖర్చు చేసే అవకాశం ఉంటుంది.
పెట్టుబడులకు అవసరమైన ప్రోత్సాహకాలు అందించే సామర్థ్యం పెరుగుతుంది.
రాష్ట్రానికి మెరుగైన ఆర్థిక స్థిరత్వం కలుగుతుంది.

4. నైపుణ్య మానవ వనరులు
స్టెమ్ కోర్సుల్లో విద్యార్థుల నమోదు దేశ సగటుతో పోలిస్తే రెండింతలు అధికంగా ఉంది.
సాంకేతిక నైపుణ్యాలు కలిగిన మానవ వనరులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయి.
నాలెడ్జ్ ఆధారిత పరిశ్రమలు, ఆధునిక తయారీ రంగాలకు అనుకూలమైన పర్యావరణ వ్యవస్థ రాష్ట్రంలో ఉంది.

**5. వేగంగా న్యాయ వివాదాల పరిష్కారం**

మెరుగైన ఈఫైలింగ్ వ్యవస్థ
వేగంగా వాణిజ్య వివాదాల పరిష్కారం
వ్యాపార సంస్థలకు అనుకూలమైన న్యాయ వ్యవస్థ

**6. పెట్టుబడిదారుల ప్రశంసలు**

అద్భుతమైన రైల్వే అనుసంధానం
మెరుగైన లాజిస్టిక్స్ మౌలిక వసతులు
ఉన్నత జీవన ప్రమాణాలు
నాణ్యమైన విద్యా, వైద్య సదుపాయాలు
నిరంతర విద్యుత్ సరఫరా
పరిశ్రమలు మూతపడే సందర్భాల్లోనూ.. పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడే విధానాలు

# సీఎస్ బ్రాంచీల్లో మిగిలిన సీట్లు 11,660

హైదరాబాద్: ఇంజినీరింగ్ కళాశాలల్లో మొత్తం 80 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. ఈసారి కంప్యూటర్ సైన్స్, ఐటీ సంబంధిత బ్రాంచీల్లో భారీగా సీట్లు మిగిలిపోయాయి... 82 శాతమే నిండాయి. చివరి విడత సీట్లను మంగళవారం కేటాయించారు. తాజా విడతలో కొత్తగా 3,281 మంది సీట్లు సాధించారు. ఎప్‌సెట్ కౌన్సెలింగ్‌లో కన్వీనర్ కోటా కింద ఈడబ్ల్యూఎస్ సీట్లతో కలుపుకొని 94,156 సీట్లు అందుబాటులో ఉండగా... చివరి విడత నాటికి 75,054 సీట్లు నిండాయి... 19,102 సీట్లు మిగిలిపోయాయి. సీఎస్ఈ, సంబంధిత 19 బ్రాంచీల్లో 66,390 సీట్లుండగా... 54,730 సీట్లు నిండాయి. ఏకంగా 11,660 సీట్లు మిగిలాయి. ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ విభాగంలో తొమ్మిది బ్రాంచీలున్నాయి. వాటిల్లో 18,759 సీట్లకు 14,127(75 శాతం) భర్తీ అయ్యాయి. సివిల్, మెకానికల్ సంబంధిత విభాగంలోని బ్రాంచీల్లో 7,872 సీట్లకు 5,378(68 శాతం) నిండాయి. అయితే తాజాగా సీట్లు పొందిన వారిలో కొన్ని వందల మంది చేరకపోవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

**7 లోపు కళాశాలల్లో రిపోర్ట్ చేయాలి...**

సీట్లు పొందిన వారు సీట్ అలాట్‌మెంట్ ఆర్డర్‌ను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఈనెల 7 లోపు అలాట్‌మెంట్ లెటర్‌లో పేర్కొన్న ట్యూషన్ ఫీజును వెబ్‌సైట్ ద్వారా చెల్లించాలి. ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసి... కళాశాలల్లో స్వయంగా రిపోర్ట్ చేయాలి. రెండో విడతలో సీట్లు పొంది... తాజాగా కళాశాల మారిన వారు, బ్రాంచి మారిన వారు సైతం కళాశాలల్లో రిపోర్ట్ చేయాలని ఎప్‌సెట్ ప్రవేశాల కమిటీ కన్వీనర్ శ్రీదేవసేన తెలిపారు. సీట్లు పొందిన వారు కళాశాలల్లో బ్రాంచీలు మారేందుకు 12, 13 తేదీల్లో స్లైడింగ్ నిర్వహిస్తామని, ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. బ్రాంచీలు మారినా ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హులేనని తెలిపారు.

# అయోధ్య నిధుల కేసులో సాధువుల ప్రమేయం లేదు: సీఎం యోగి ఆదిత్యనాథ్

అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి ఆలయ విరాళాల దుర్వినియోగం ఆరోపణల కేసులో సాధువులు, సంతుల ప్రమేయం ఏమీ లేదని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్పష్టం చేశారు. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సమర్పించిన ప్రాథమిక నివేదికలో ఈ విషయం వెల్లడైందని ఆయన మంగళవారం పేర్కొన్నారు. ఈ అంశంపై సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్‌లు కేవలం రాజకీయ లబ్ధి కోసమే రాద్ధాంతం చేస్తున్నాయని యోగి ఆరోపించారు. ఉత్తరప్రదేశ్ ప్రతిష్ఠను మసకబార్చేందుకు, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే విపక్షాలు ప్రయత్నిస్తున్నాయని ఆయన విమర్శించారు. అసెంబ్లీలో నిర్ణీత ఎజెండాపై చర్చ జరపకుండా, సభా కార్యక్రమాలకు అంతరాయం కలిగించడం అప్రజాస్వామికమని, రాజ్యాంగ విరుద్ధమని ఆయన వ్యాఖ్యానించారు. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రస్తావిస్తామని విపక్షాలు ప్రకటించడంతో ఈ వివాదం మరోసారి ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కేసు విచారణ నిమిత్తం ఐజీ కిరణ్ నేతృత్వంలో నూతన సిట్‌ను ఏర్పాటు చేసినట్లు జూలై 27న రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు విన్నవించింది. ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు బృందం ఇప్పటివరకు ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

# గుజరాత్‌లో చండీపుర వైరస్‌తో 22 మంది మృతి

గుజరాత్‌లో చండీపుర వైరస్ మరోసారి కలకలం రేపుతోంది. ఈ వైరస్ కారణంగా ఇప్పటివరకు 22 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. మరో 35 మందికి వైరస్ సోకినట్లు నిర్ధారణ అయింది. సాధారణ జ్వరంలా మొదలయ్యే ఈ ఇన్‌ఫెక్షన్ కొన్ని గంటల్లోనే మెదడుపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉండటంతో వైద్యులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. అసలు చండీపుర వైరస్ అంటే ఏంటి? ఇది ఎలా వ్యాపిస్తుంది? లక్షణాలు ఏంటి? చికిత్స ఉందా? తెలుసుకుందాం..

**ఏంటీ వైరస్?**

రాబ్డోవిరిడే కుటుంబానికి చెందినదే ఈ చండీపుర వైరస్ (సీహెచ్‌పీవీ). దీన్ని తొలిసారి 1965లో భారత్‌లో గుర్తించారు. వర్షాకాలంలో ఎక్కువగా కనిపించే శాండ్‌ఫ్లై (ఇసుక ఈగ) వల్ల ఇది వ్యాపిస్తుంది. మనుషుల నుంచి మనుషులకు ఈ వైరస్ సోకినట్లు ఇప్పటివరకు ఆధారాలు లేవు.

**ఎవరికి ఎక్కువ ప్రమాదం?**

ఈ వైరస్ ఎక్కువగా 15 ఏళ్లలోపు చిన్నారులపై ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో, శాండ్‌ఫ్లైలు ఎక్కువగా ఉండే చోట్ల ప్రమాదం అధికంగా ఉంటుంది. వర్షాకాలంలో ఈగల సంఖ్య పెరగడంతో వైరస్ వ్యాప్తి కూడా ఎక్కువగా కనిపిస్తుంది.

**మొదట కనిపించే లక్షణాలు ఏవి?**

ప్రారంభంలో ఈ వైరస్‌ను గుర్తించడం కాస్త కష్టం. ఎందుకంటే మొదట సాధారణ వైరల్ జ్వరంలాగే కనిపిస్తుంది. జ్వరం, తలనొప్పి, వాంతులు, విరేచనాలు, నీరసం, ఫ్లూ లక్షణాలు ఉంటాయి. ఈ దశలో చాలామంది సాధారణ జ్వరంగా భావించే అవకాశం ఉంటుంది.

**ఎందుకు ప్రమాదకరం?**

కొంతమంది చిన్నారుల్లో వైరస్ చాలా వేగంగా మెదడుపై దాడి చేస్తుంది. దీంతో మెదడు వాపు (ఎన్‌సెఫలైటిస్) వస్తుంది. ఆ తర్వాత పరిస్థితి గంటల వ్యవధిలోనే విషమించవచ్చు.

**తీవ్రమైన లక్షణాలు ఇవీ..**

మూర్ఛ, స్పృహ కోల్పోవడం, కోమాలోకి వెళ్లడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందుల వంటి తీవ్రమైన లక్షణాలు కనిపిస్తాయి. కొన్ని కేసుల్లో ఆసుపత్రిలో చేరిన 48 నుంచి 72 గంటల్లోనే ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

**చికిత్స ఉందా?**

ప్రస్తుతం చండీపుర వైరస్‌కు ప్రత్యేకంగా పనిచేసే మందు లేదు. టీకా కూడా అందుబాటులో లేదు. రోగికి కనిపించే లక్షణాలను బట్టి చికిత్స అందిస్తారు. శ్వాస, రక్తపోటు వంటి కీలక అవయవాల పనితీరును నిలకడగా ఉంచే ప్రయత్నం చేస్తారు. అందుకే లక్షణాలు కనిపించగానే ఆలస్యం చేయకుండా ఆసుపత్రికి తీసుకెళ్లడం కీలకం.

**ఎలా జాగ్రత్త పడాలి?**

చండీపుర వైరస్‌కు ప్రత్యేక టీకా లేకపోవడంతో నివారణే ఉత్తమ మార్గం. శాండ్‌ఫ్లై కాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలకు పూర్తి చేతులు కవర్ అయ్యేలా దుస్తులు వేయాలి. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. కీటకనాశక ద్రావణాలు, దోమతెరలు ఉపయోగించాలి. జ్వరం, వాంతులు, మూర్ఛలు కనిపిస్తే వెంటనే వైద్యుణ్ని సంప్రదించాలి.

**ఎందుకు అప్రమత్తంగా ఉండాలి?**

చండీపుర వైరస్ చాలా అరుదుగా కనిపించినా, ఒకసారి సోకితే వేగంగా తీవ్ర స్థితికి చేరుకునే ప్రమాదం ఉంది. అందుకే పిల్లల్లో సాధారణ జ్వరంతో పాటు నాడీ సంబంధిత లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య పరీక్షలు చేయించాలని నిపుణులు సూచిస్తున్నారు.

# సరిహద్దులో చైనా శతఘ్నులను మోహరించిన పాకిస్థాన్.. భారత్ గట్టి వార్నింగ్

భారత సరిహద్దు వెంబడి చైనా తయారీకి చెందిన దాదాపు 250 ఎస్‌హెచ్15 శతఘ్నులను పాకిస్థాన్ మోహరించినట్లు వెలువడిన వార్తలపై భారత్ తీవ్రంగా స్పందించింది. జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవడానికి 'అవసరమైన ప్రతి చర్య' తీసుకుంటామని మంగళవారం స్పష్టం చేసింది. సరిహద్దు ఉగ్రవాదాన్ని భారత్ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని, దేశ రక్షణకు తాము సర్వసన్నద్ధంగా ఉన్నామని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తేల్చిచెప్పారు. చైనాకు చెందిన 'నొరింకో' సంస్థ నుంచి 236 ఎస్‌హెచ్15 శతఘ్నుల కొనుగోలుకు పాకిస్థాన్ 2019లో ఒప్పందం కుదుర్చుకుంది. 2022 నుంచి వీటి సరఫరా ప్రారంభం కాగా, భారత్ సరిహద్దులకు ఎదురుగా ఉన్న గుజ్రాన్‌వాలా, సియాల్‌కోట్, జలాల్‌పూర్ జట్టాన్ సెక్టార్లలో వీటిని మోహరించారు. ముఖ్యంగా షకర్‌గఢ్ బల్జ్ సమీపంలో వీటిని అధికంగా కేంద్రీకరించారు. రాకెట్ సాంకేతికత సాయంతో ఇవి 50 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను సైతం ఛేదించగల సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. గతంలో జరిగిన 'ఆపరేషన్ సిందూర్'ను ఈ సందర్భంగా ప్రస్తావించిన జైస్వాల్, ఆనాడు పాకిస్థాన్‌కు తగిన బుద్ధి చెప్పామని గుర్తుచేశారు. మరోవైపు, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో (పీవోకే) ఇటీవల నిర్వహించిన స్థానిక ఎన్నికలను ఆయన 'పూర్తి బూటకం'గా అభివర్ణించారు. ప్రజల అసమ్మతిని అణచివేసేందుకు పాకిస్థాన్ బలప్రయోగం చేస్తోందని, జూన్ నుంచి ఇప్పటివరకు సుమారు 90 మంది పౌరులు మరణించారని ఆరోపించారు. తమ భూభాగంలోని ఉగ్రవాద స్థావరాలను తక్షణమే నిర్మూలించాలని ఆయన పాకిస్థాన్‌ను డిమాండ్ చేశారు.

# మోదీ పోస్టు తొలగింపు వ్యవహారం.. మెటాను ప్రశ్నించనున్న కేంద్రం

సోషల్ మీడియా దిగ్గజం మెటా పనితీరుపై కేంద్ర ప్రభుత్వం మరింత దృష్టి సారించింది. సంస్థ గ్లోబల్ హెడ్ ఆఫ్ పబ్లిక్ పాలసీ జోయెల్ కాప్లాన్‌తో పాటు ఇన్‌స్టాగ్రామ్‌కు చెందిన అధికారిని ఆగస్టు 5న సమావేశానికి హాజరుకావాలని ఆదేశించింది. మెటా ఆల్గారిథమ్ ఎలా పనిచేస్తుంది? కొన్ని పోస్టులకు ఎందుకు ఎక్కువ ప్రాధాన్యం లభిస్తుందనే అంశాలపై వివరణ కోరనుంది. కొన్ని రాజకీయ పోస్టులు, ముఖ్యంగా ప్రభుత్వాన్ని విమర్శించే కంటెంట్‌కు అసాధారణ స్థాయిలో ప్రచారం లభిస్తోందన్న ఫిర్యాదులు ప్రభుత్వానికి అందినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మెటా సిఫార్సు వ్యవస్థ, కంటెంట్‌ను విస్తృతంగా చూపించే విధానం, పోస్టుల తొలగింపులో అనుసరిస్తున్న భద్రతా చర్యలపై అధికారులు ప్రశ్నించే అవకాశం ఉంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పోస్టు తొలగింపును 'సాంకేతిక లోపం'గా మెటా పేర్కొంది. దీనిపై పూర్తి లిఖితపూర్వక వివరణతో పాటు క్షమాపణ కూడా ఇవ్వాలని కేంద్రం కోరనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఐటీ శాఖ కార్యదర్శి ఎస్.కృష్ణన్ మాట్లాడుతూ.. ఆగస్టు 5, 6 తేదీల్లో మెటా ప్రతినిధులతో సమావేశాలు జరుగుతాయని చెప్పారు. భారత చట్టాల అమలు, నిబంధనల వర్తింపు, కృత్రిమ మేధతో రూపొందించిన కంటెంట్, ప్రముఖుల ఖాతాలకు సంబంధించిన పోస్టుల తొలగింపులో తీసుకునే జాగ్రత్తలపై చర్చిస్తామని వెల్లడించారు. జులై 23న ప్రధానమంత్రి మోదీ విద్యార్థుల నిరసనలపై స్పందిస్తూ పరీక్ష ప్రశ్నపత్రాల లీకేజీలపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పిన సెల్ఫీ వీడియోను ఫేస్‌బుక్ కొంతసేపు తొలగించింది. తర్వాత సాంకేతిక లోపం వల్లే అలా జరిగిందంటూ మెటా ఆ వీడియోను పునరుద్ధరించి క్షమాపణ చెప్పింది. అయితే ఆ వివరణను కేంద్రం నిశితంగా పరిశీలిస్తోంది. ప్రధానమంత్రి మోదీకి సంబంధించిన ఏఐ మార్ఫింగ్ వీడియోలు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో వ్యాపించడంపైనా విచారణ కొనసాగుతోంది. ఈ వ్యవహారంలో మెటా ఇండియా అధిపతి అరుణ్ శ్రీనివాస్‌తో పాటు మరికొందరిపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆ వీడియోల మూలం, వాటి వ్యాప్తి, మెటా భద్రతా వ్యవస్థ పనితీరుపై దర్యాప్తు

# మాజీ గవర్నర్ డీవై పాటిల్ కన్నుమూత

త్రిపుర, బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల మాజీ గవర్నర్ డీవై పాటిల్ కన్నుమూశారు. వయోభారం వల్ల ఎదురైన ఆరోగ్య సమస్యలతో మహారాష్ట్రలోని కొల్హాపూర్ లో ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయన వయసు 90 సంవత్సరాలు. ఆయన మృతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు. విద్య, వైద్యం, ప్రజాసేవా రంగాలలో ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని వ్యాఖ్యానించారు. 1935 అక్టోబర్ 22న జన్మించిన డీవై పాటిల్ దేశ విద్యా రంగానికి విశేష సేవలందించారు. ఆయన స్థాపించిన 'డీవై పాటిల్ గ్రూప్' ఆధ్వర్యంలో భారతదేశమంతటా 182కి పైగా విద్యా సంస్థలు, 7 డీమ్డ్ విశ్వవిద్యాలయాలు నడుస్తున్నాయి. మహారాష్ట్రలో ఎమ్మెల్యేగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ఆయన, 2009 నుండి 2013 వరకు త్రిపుర గవర్నర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు కూడా గవర్నర్‌గా సేవలందించారు. విద్యా, సామాజిక రంగాల్లో ఆయన చేసిన కృషికి గానూ 1991లో భారత ప్రభుత్వం ఆయనను 'పద్మశ్రీ' పురస్కారంతో సత్కరించింది.

# రెండున్నరేళ్లలోనే ఆంధ్రప్రదేశ్‌కు రూ.19,619 కోట్లు: లోక్‌సభలో కేంద్రం వెల్లడి

- **గత రెండున్నరేళ్లలో ఏపీకి ప్రత్యేక సాయం**
- **గత వైసీపీ ప్రభుత్వం కంటే అధికంగా నిధులు సాధించిన కూటమి ప్రభుత్వం**
- **లోక్‌సభలో వైసీపీ ఎంపీ ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ అధికారిక సమాధానం**
- **ఆర్థిక క్రమశిక్షణ, సమర్థవంతమైన అమలు వల్లే ఇది సాధ్యమైందన్న రాష్ట్ర ప్రభుత్వం**
- **మూలధన వ్యయం కోసం కేంద్రం 50 ఏళ్లకు వడ్డీలేని రుణాలు**



ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి భారీగా ఆర్థిక చేయూత లభించింది. "రాష్ట్రాలకు మూలధన పెట్టుబడుల కోసం ప్రత్యేక సహాయ పథకం" (ఎస్ఏఎస్‌సీఐ) కింద గత రెండున్నరేళ్ల కాలంలోనే రాష్ట్రానికి రూ.19,619 కోట్లు అందాయని కేంద్ర ప్రభుత్వం మంగళవారం నాడు లోక్‌సభలో ప్రకటించింది. 2020 నుంచి 2024 మధ్య గత వైసీపీ ప్రభుత్వం సాధించిన రూ. 11,386 కోట్లతో పోలిస్తే ఇది అధికమని ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పార్లమెంటులో ఈ వివరాలను అధికారికంగా సమర్పించింది. ఆర్థిక క్రమశిక్షణను పాటించడం, ప్రాజెక్టుల ప్రతిపాదనలను సకాలంలో సిద్ధం చేసి సమర్థవంతంగా అమలు చేయడం వల్లే స్వల్ప కాలంలోనే ఎక్కువ నిధులను సాధించగలిగామని తెలుగుదేశం నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది. కేంద్రం వెల్లడించిన వివరాల ప్రకారం, 2020-21 ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటివరకు ఈ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు మొత్తం రూ. 31,005.47 కోట్లు అందాయి. ఇందులో ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే రూ. 19,619 కోట్లు విడుదలయ్యాయి. 2024-25లో రూ. 7,901.56 కోట్లు, 2025-26లో రూ. 8,289.61 కోట్లు, 2026-27లో ఆగస్టు 1 నాటికి రూ. 3,428.14 కోట్లు మంజూరయ్యాయి. మూలధన వ్యయం కోసం రాష్ట్రాలకు 50 ఏళ్ల కాలపరిమితితో వడ్డీ లేని రుణాలను అందించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశం. గత ప్రభుత్వ హయాంలో 2020-21లో రూ. 688 కోట్లు, 2022-23లో రూ. 6,105 కోట్లు, 2023-24లో రూ. 4,090.81 కోట్లు ఈ పథకం కింద అందాయి. మరోవైపు, రాష్ట్ర విభజన జరిగిన 2014-15 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ లోటు రూ. 16,078.76 కోట్లుగా అకౌంటెంట్ జనరల్ నిర్ధారించినట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అదే ఎంపీకి ఇచ్చిన మరో సమాధానంలో తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనానుభవం, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో మౌలిక సదుపాయాల అభివృద్ధిని వేగవంతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. తద్వారా మరిన్ని పెట్టుబడులను ఆకర్షించి సమ్మిళిత వృద్ధిని సాధిస్తామని ధీమా

# శరవేగంగా ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్

హైదరాబాద్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న 'భారత్ ఫ్యూచర్ సిటీ' మాస్టర్ ప్లాన్‌ను శరవేగంగా సిద్ధం చేయడంపై దృష్టి పెట్టింది. దీన్ని రూపొందించే బాధ్యతను సింగపూర్‌కు చెందిన అంతర్జాతీయ సంస్థకు అప్పగించింది. ప్రపంచంలోని ఫార్చ్యూన్ 500 కంపెనీలు భారత్‌లో పెట్టుబడులు పెట్టాలంటే.. తెలంగాణే తొలి గమ్యస్థానం కావాలనే లక్ష్యంతో దీన్ని తీర్చిదిద్దుతున్నారు. ముఖ్యంగా ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టే వారికి అపార అవకాశాలు ఉండేలా వివిధ జోన్ల కింద ప్రత్యేకంగా నిర్మించనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఇప్పటికే పలుమార్లు దీని రూపకల్పనపై సమావేశాలు జరిగాయి. మాస్టర్ ప్లాన్‌కు తుదిరూపునిచ్చి.. డిసెంబరులో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ 2026'లో విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**డిసెంబరుకు స్కిల్స్ వర్సిటీ కూడా సిద్ధం**

30 వేల ఎకరాల్లో నిర్మితమవుతున్న ఫ్యూచర్ సిటీలో ఇప్పటికే 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. డిసెంబరులోగా ఈ యూనివర్సిటీ పనులను పూర్తిచేసి.. ఈ ప్రాంగణాన్ని కూడా అధికారికంగా ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది.

# వైభవంగా మార్వాడీ కావడి యాత్ర

* **రామ్ మందిర్ నుంచి రామేశ్వరం వరకు చేపట్టిన పాదయాత్ర**

ప్రజాస్ఫూర్తి, షాద్నగర్ : శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని నగరంలో, రాజస్థాని, మార్వాడీ సంఘ్ ఆధ్వర్యంలో కావడి యాత్ర అత్యంత భక్తిశ్రద్ధలు, ఆధ్యాత్మిక ఉత్సాహాల నడుమ వైభవంగా సాగింది. పట్టణంలోని రామమందిరం నుంచి ప్రారంభమైన ఈ యాత్ర చౌడమ్మా గుట్ట ఆంజనేయ స్వామి సన్నిధికి అక్కడి నుంచి రామలింగేశ్వర స్వామి ఆలయానికి కాషాయ వస్త్రాలు ధరించిన భక్తులు, మహిళలు, భక్తులు పరమశివుడి నామస్మరణతో మార్గమధ్యమంతా శివమయం చేశారు. స్వచ్ఛమైన జలాశయం నుంచి సేకరించిన పవిత్ర గంగాజలాన్ని భుజాలపై కావళ్లలో మోస్తూ, కాళ్లకు పాదరక్షలు లేకుండా కిలోమీటర్ల కొద్దీ కాలినడకన సాగారు. యాత్ర పొడవునా బోల్ బమ్ హర్ హర్ మహాదేవ్, జై శివ్ శంభో అంటూ భక్తులు చేసిన శివనామస్మరణ మారుమోగింది. అనంతరం స్థానిక శివాలయానికి చేరుకుని, సేకరించిన పవిత్ర జలాలతో పరమశివునికి మహా రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా యాత్ర మార్గ మధ్యలో చౌడమ్మా గుట్ట ఆంజనేయ స్వామి ఆలయంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మున్సిపల్



చైర్మన్ బస్వం, వైస్ చైర్మన్ అందేమోహన్, కౌన్సిలర్లు పెంటయ్య, దిలీప్, దేవాలయం ప్రధాన నిర్వహకులు మామిడి శ్రీశైలం గౌడ్ తదితరులు మార్వాడి భక్తులతో కలిసి ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు ఎమ్మెల్యే ను, భక్తులను ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కఠినమైన నియమనిష్టలతో, కాళ్లకు పాదరక్షలు కూడా లేకుండా కిలోమీటర్ల కొద్దీ నడుస్తూ గంగాజలాన్ని మోసుకెళ్లడం భక్తుల అపారమైన శివభక్తికి నిదర్శనం. సమాజంలో శాంతి సౌభాగ్యాలు విల్లివిరియాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆ పరమశివుడిని ప్రార్థిస్తున్నాను అని తెలిపారు. ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో సోదరభావాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయని ఆయన అన్నారు. అనంతరం కావడి యాత్రలో పాల్గొన్న భక్తులతో కలిసి శివనామస్మరణ చేస్తూ కావడి లను తన భుజం పై మోశారు. ఎమ్మెల్యే తో పాటు స్థానిక ఏసీపీ, సీఐ, మున్సిపల్ చైర్మన్ బస్వం తదితరులు కావడి లను తన భుజం పై మోశారు. అదేవిధంగా నిర్వాహకులు మాట్లాడుతూ... లోక కల్యాణం కోసం హాలాహలాన్ని మింగిన పరమశివుడి ఉష్ణాన్ని చల్లబర్చేందుకే ఈ గంగాజలాభిషేకం చేస్తామని తెలిపారు. ఈ యాత్రలో పురుషులతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు, యువకులు పాల్గొని శివానుగ్రహం పొందారు. భక్తులకు మార్గమధ్యంలో పలువురు దాతలు మంచినీరు, అల్పాహార వసతులను ఏర్పాటు చేశారు. అనంతరం రామేశ్వరం చేరుకున్న భక్తులు ఆ పరమశివుడికి ప్రత్యేక పూజలు చేసి, వారు తెచ్చిన గంగజాలం తో అభిషేకలు చేశారు. ఈ కార్యక్రమం లో రాజస్థాని సేవాసంఘ్ అధ్యక్షులు భావార్లల్ చౌదరి, హరి ప్రసాద్, ప్రకాష్ చంద్, రామ్ అవతార్, పవన్ కుమార్, కాళీరం, గజేందర్ గోర్, రామ్ మందిర్ రాజస్థాని సంఘ్ కమిటి ప్రధాన కార్యదర్శి కమల్ కిషోర్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అరెకటిక బోనాల ఊరేగింపు



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: ఆషాఢ మాసం సందర్భంగా మెదక్ జిల్లా కేంద్రంలో అరె కటిక సంఘం ఆధ్వర్యంలో నల్ల పోచమ్మ బోనాల మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బోనాల ఊరేగింపు భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా సాగింది. పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల ఆటలు భక్తులను విశేషంగా ఆకట్టుకోగా, చిన్నారులు, యువతులు, యువకులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు ఊరేగింపు కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దుర్గామాత విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి ఊరేగింపులో తీసుకెళ్లగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులను అభినందిస్తూ, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అరె కటిక సంఘం సభ్యులు, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాల వేడుకలను విజయవంతం చేశారు.

## దేశ భవిష్యత్తు..
## వారి సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత

* **దర్గపల్లిలో సర్పంచ్ పెంబర్ల శైలజ రమేష్ అధ్యక్షతన బాలసభ**



ప్రజాస్ఫూర్తి, సిద్దిపేట జిల్లా: నంగునూరు మండలం,దర్గపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ పెంబర్ల శైలజ రమేష్ అధ్యక్షతన బాలసభను నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల హక్కులు, విద్య, ఆరోగ్యం, పోషకాహారం, రక్షణ తదితర అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. "పిల్లలే మన దేశానికి భవిష్యత్తు. ప్రతి చిన్నారికి విద్య, ఆరోగ్యం, పోషకాహారం, రక్షణతో పాటు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే హక్కు ఉంది" అని అన్నారు. పిల్లలు బాగా చదువుకుని, మంచి సంస్కారం, క్రమశిక్షణ, సేవాభావంతో ఎదిగి గ్రామానికి, రాష్ట్రానికి, దేశానికి ఆదర్శ పౌరులుగా నిలవాలని ఆకాంక్షించారు.ప్రస్తుత కాలంలో మొబైల్ ఫోన్లకు పిల్లలు ఎక్కువ సమయం కేటాయించకుండా చదువు, ఆటలు, పుస్తక పఠనం, మంచి అలవాట్లకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. బాలల సమగ్ర అభివృద్ధికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. గ్రామపంచాయతీ తరపున పిల్లల సంక్షేమం, పాఠశాల అభివృద్ధి, పరిశుభ్రత, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ఎల్లప్పుడూ కృషి చేస్తామని సర్పంచ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి సతీష్, ప్రధానోపాధ్యాయులు శ్రీకాంత్ రెడ్డి, నాగలక్ష్మి, పరమేశ్వరి, అంగన్వాడీ టీచర్ స్వరూపతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## 2020 పాత రేట్లనే అమలు చేయాలి

* **మార్బుల్ అసోసియేషన్ ఆధ్వర్యంలోబారీ ధర్నా**

ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : 2020 సంవత్సరంలో ఉన్న పాత రేట్లనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నల్లగొండ పట్టణ గ్రామీణ మార్బుల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ రోడ్డులోని మార్బుల్ షాపుల ముందు మంగళవారం మార్బుల్ కార్మికులు భారీ ధర్నా చేపట్టారు. ధర్నాను ఉద్దేశించి యూనియన్ గౌరవాధ్యక్షులు దాసరి దేవయ్య అధ్యక్షుడు ఎన్ హరి తదితరులు మాట్లాడుతూ, బిల్డర్లు గృహ నిర్మాణ యజమానులు ఒక్కటై మార్బుల్ రేట్లను తగ్గించారని, దీనివలన తాము అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఇంటికి రాయిలు, పిల్లల చదువులు, అనారోగ్య సమస్యలతో తాము ఇబ్బందులు పడుతున్నామని,2025లో అమలు చేస్తున్న పాతరెట్లనే ప్రస్తుతం కూడా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. రాజస్థాన్ వంటి దూర ప్రాంతాల నుండి వచ్చిన వలస కార్మికులకు మార్బుల్ కూలి రేట్లు గిట్టుబాటు కాకపోవడంతో వాళ్లు అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తపరిచారు. అలాగే ఇసుక మోపించడానికి గాని బండలు లోపల పైన పెట్టించాలని పెద్దబండలకు అదనపు లేబర్ ను ఫిట్టింగ్ చేసేటప్పుడు నియమించాలని కోరారు. అలాగే తమకు ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలు అయినా ఇందిరమ్మ ఇండ్లు, హెల్త్ కార్డులు, పెన్షన్లు అందజేయాలని, కోరారు,ఈ కార్యక్రమంలో మరో గౌరవాధ్యక్షుడు ఎం శ్రీనివాస్, కార్యదర్శి శ్రీకాంత్ క్రాంతి, కోశాధికారి శ్రీను, సహాయ కార్యదర్శి దేవి సింగ్, ఆర్థిక కార్యదర్శి రాంపాల్, ఉపాధ్యక్షులు ఎస్ జానీ,కార్యవర్గ సభ్యులు శిరసావాడ సైదులు,ఎస్ గురువులు, మట్టి శెట్టి సైదులు,చందు, సురేష్, నకరికంటి రవి, చిగుళ్ల శంకర్, భకరం మహేందర్, రాజస్థాన్ సంజయ్, రాజస్థాన్ సంతోష్,రాజస్థాన్ రాంప్రసాద్,దాసరి మల్లేష్, దాసరి శేఖర్ తోపాటు 150 మంది కార్మికుల పాల్గొన్నారు.

## అడవి పందుల అక్రమ రవాణా



ప్రజా స్ఫూర్తి, భైంసా: నిర్మల్ జిల్లా బాసర గోదావరి వద్ద ఉన్న అటవీశాఖ చెక్‌పోస్ట్‌లో మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో అడవి పందులను అక్రమంగా తరలిస్తున్న బొలెరో వాహనాన్ని అటవీశాఖ అధికారులు పట్టుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి సిద్ధిపేటకు సుమారు 23 అడవి పందులను బొలెరో వాహనంలో తరలిస్తున్నట్లు గుర్తించిన అధికారులు వాహనంతో పాటు ఇద్దరినీ భైంసా అటవీశాఖ కార్యాలయానికి తరలించినట్లు డిప్యూటీ రేంజ్ అధికారి ఎం. శంకర్ తెలిపారు.స్వాధీనం చేసుకున్న అడవి పందులకు వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం వాటిని అటవీ ప్రాంతంలో వదిలివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో ఫారెస్ట్ బీట్ అధికారులు శివ,సంజయ్, చెక్‌పోస్ట్ వాచర్లు సద్దాం, నరేంద్ర, అనిమల్ ట్రాకర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కరెంటు కోతలతో రైతులకు తీవ్ర ఇబ్బందులు

* **వ్యవసాయ కరెంటు కోతలపై అఖిలపక్ష పార్టీలు ధర్నా.**



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : హుస్నాబాద్ సబ్ స్టేషన్ ముందు వ్యవసాయ రంగానికి 10, గంటల కరెంటు అందులో అప్రకటిత కరెంటు కోతలతో రైతులను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై అఖిలపక్ష పార్టీలు ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ 3, సంవత్సరాల క్రితం ఎన్నికల మేనిఫెస్టోలో 24 గంటల ఉచిత నాణ్యతమైన కరెంటు రైతులకు అందిస్తామని ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి మరియు రాహుల్ గాంధీ హామీ ఇవ్వడం జరిగింది. గత మూడు సంవత్సరాలలో ఎన్నడు 24 గంటల కరెంటు ఇవ్వలేదు. గడిచిన యాసంగిలో కూడ 18 ,గంటలు కరెంటు ఇవ్వడం జరిగింది. కానీ ప్రస్తుతం వర్షాలు లేక వ్యవసాయ బావులలో 3, నుంచి 8, గంటలు మాత్రమే నీరు వెళ్లే పరిస్థితిలు ఉన్నాయి. పొలాలు దున్నే సమయం కాబట్టి బోర్ల కింద వ్యవసాయం చేసే రైతులకు కరెంటు కచ్చితంగా 18 గంటల కరెంట్ అవసరం ఉంటుంది. వర్షాలు ఎక్కువగా కురియనప్పుడు కరెంటు డిమాండ్ పెద్దగా రైతులకు అవసరం ఉండదు. ప్రస్తుతం పంటల సాగు మొక్కజొన్న, పత్తి ,వరి, కంది చాలా మటుకు 50 శాతం సేద్యం తగ్గిన పరిస్థితి ఉన్నది . ఎక్కువగా కరెంటు డిమాండ్ లేకున్నా రైతులకు 18 గంటలు కరెంటు ఇవ్వకుండా. ఆరిగోస పెట్టడం జరుగుతుందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ రైతులకు మేము 24 గంటల కరెంటు ఇస్తామని ఇచ్చిన హామీ అమలు చేయలేకపోతున్నామని పత్రికాముఖంగా సీఎం, రేవంత్ రెడ్డి తెలుపాలని ఈ సందర్భంగా అఖిలపక్ష పార్టీలు డిమాండ్ చేయడం జరిగింది. వ్యవసాయ రంగానికి కరెంటు అప్రకటిత కోతలతో రైతులను ఇబ్బంది పెడితే అఖిలపక్ష పార్టీలు రైతులతో మంత్రి పొన్నం ప్రభాకర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి బీలు నాయక్, బిఆర్ఎస్ పార్టీ మాజీ అధికార ప్రతినిధి ఐలెని మల్లికార్జున్ రెడ్డి బీఎస్పీ పార్టీ ఇన్చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్, బిజెపి టౌన్ ప్రెసిడెంట్ బత్తుల శంకర్ బాబు , చిత్తారి శ్రీనివాస్ మారేపల్లి సుధాకర్ బొజ్జ హరీష్ విజయ భాస్కర్ వరియోగుల అనంతస్వామి మొగిలిపాక శ్రీనివాస్ యాస శ్రీనివాస్, తిరుపతి నాయక్ ఇరుగు రమేష్ రైతులు రాఘవరెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హైవేపై గుంతలను పూడ్చిన సూర్యాపేట ట్రాఫిక్ పోలీసులు

* **రోడ్డు ప్రమాదాల నివారణకే ప్రాధాన్యత.**



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు, పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ మరియు సిబ్బంది ఈరోజు సామాజిక బాధ్యతను చేపట్టారు. సూర్యాపేట పట్టణ పరిధిలోని గల జాతీయ రహదారి 65 పై వాహనదారులకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్న పెద్ద పెద్ద గుంతలను ట్రాఫిక్ పోలీసులు ఈరోజు దగ్గరుండి పూడ్చివేయించారు. విస్తరణ పనులు, వర్షాలు, వాహనాల రద్దీ కారణంగా సూర్యాపేట పట్టణ పరిధిలో జాతీయ రహదారిపై ప్రమాదకరమైన గుంతలు ఏర్పడ్డాయి. దీనివల్ల ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనాల చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వాహనాల వేగం అకస్మాత్తుగా తగ్గడం వల్ల ట్రాఫిక్ జామ్‌లు కూడా ఏర్పడుతున్నాయి. ఈ విషయాన్ని గమనించిన ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది, తక్షణమే స్పందించి రోడ్డుపై ఉన్న గుంతలను మట్టి, కంకరతో నింపి తాత్కాలికంగా మూసివేశారు. వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా రోడ్డును సమన్వయం చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ మాట్లాడుతూ.. వాహనదారుల భద్రతే మా మొదటి ప్రాధాన్యత అని తెలిపారు. జాతీయ రహదారిపై ప్రయాణించేటప్పుడు ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యగా ఈ గుంతలను పూడ్చినట్లు పేర్కొన్నారు. హైవేపై ప్రయాణించే వాహనదారులు కూడా నిఘా నిబంధనలు పాటిస్తూ, పరిమిత వేగంతో ప్రయాణించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ ఐ యాదవేందర్ రెడ్డి , సిబ్బంది పాల్గొన్నారు.




## తెలంగాణ మజ్దూర్ యూనియన్ విజయమే లక్ష్యం

**: అశ్వద్ధామ రెడ్డి.**

ప్రజాస్ఫూర్తి, నల్లగొండ: వచ్చే ఎన్నికల్లో తెలంగాణ మజ్దూర్ యూనియన్‌ను విజయపథంలో నడిపించాలని యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం నల్గొండలోని రత్న ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన ఆర్టీసీ నలగొండ రీజినల్ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశ్వదామా రెడ్డి పాల్గొని మాట్లాడారు.కార్మికుల సమస్యల పరిష్కారం, వారి హక్కుల పరిరక్షణ, సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. తెలంగాణలో ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం మజ్దూర్ యూనియన్తోనే సాధ్యమవుతుందని అన్నారు.పాత బకాయిలా నిధులు విడుదల లో తమ నాయకత్వం చేసిన పోరాటం కార్మికులు గమనించాలని అన్నారు. ప్రభుత్వం లో ఆర్టీసీ విలీనం లో మనమే కీలక పాత్ర వహిస్తామని తెలిపారు.ఈ సందర్భంగా యూనియన్ అభ్యర్థి అశ్వద్ధామ రెడ్డిని అత్యధిక ఓట్లతో గెలిపించాలని నాయకులు, కార్మికులను కోరారు. ఎన్నికల్లో తెలంగాణ మజ్దూర్ యూనియన్‌కు మద్దతు తెలుపుతూ అశ్వద్ధామ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.నల్గొండ రీజినల్ పరిధిలోనీ 7 డిపోలలో విస్తృత ప్రచారం చేయాలనీ కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు ఎం శంకర్, జిల్లా అధ్యక్షులు తయ్యబ్, కార్యదర్శి శ్రీనివాస్, నిరంజన్, యాదయ్య, వీళ్ళ ప్రభాకర్, సుంకరి శ్రీనివాస్, కార్మికుల తదితరులు పాల్గొన్నారు.

## ఏ టీ ఏ 19వ మహాసభల ముగింపు వేడుకల్లో ఘనంగా ఆత్మీయ సన్మానం




ప్రజా స్ఫూర్తి, నల్లగొండ : అమెరికాలోని మేరీల్యాండ్ రాష్ట్రంలోని బాల్టిమోర్ నగరంలో అంగరంగ వైభవంగా నిర్వహించిన ఏ టీ ఏ 19వ మహాసభల ముగింపు వేడుకల సందర్భంగా ప్రత్యేక ఆత్మీయ సన్మానం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగు సమాజానికి సంస్కృతికి అందించిన సేవలను గుర్తుచేసుకుంటూ, ఏ టీ ఏ టీ డి ఫ్ ప్రతినిధులు తెలంగాణ డెవలప్మెంట్ ఇండియా చైర్మన్ ఎం.వి. గోనారెడ్డిని ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా, గోనారెడ్డి మాట్లాడుతూ "సముద్రాలు దాటినా మన తెలుగు తనాన్ని, ఆత్మీయతను గుండెల్లో పదిలపరుచుకున్న ఎన్నారై సభ్యుల మధ్య ఈ సన్మానం స్వీకరించడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. ఈ అవకాశాన్ని అందించిన నిర్వాహకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సన్మానం మాకు ఎంతో సంతోషాన్ని స్ఫూర్తిని కలిగించిందని ఈ ఉత్సాహంతో తెలంగాణ ప్రాంత సుస్థిరాభివృద్ధి కోసం మరింత కృషి చేస్తాం అని యం. వి. గోనా రెడ్డి తెలిపారు.

## గిరిజనుల సమస్యలు తీర్చేందుకు అందుబాటులో ఉంటా

* **బిజెపి ఎస్టి మోర్చా వరంగల్ జిల్లా ఇన్చార్జిగా గుగులోతు తిరుపతి నాయక్**



అక్కన్నపేట, ప్రజాస్ఫూర్తి : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట మండలం పెద్దతండ గ్రామానికి చెందిన బిజెపి గిరిజన నాయకులు గుగులోతు తిరుపతి నాయక్ కు వరంగల్ జిల్లా ఎస్టీ మోర్చా ఇన్చార్జిగా బాధ్యతలు ఇచ్చినట్లు రాష్ట్ర ఎస్టీ మోర్చా అధ్యక్షులు నేనావత్ రవి నాయక్ తెలిపారు.ఈ సందర్భంగా గూగులోతు తిరుపతి నాయక్ సోమవారం హుస్నాబాద్ లో విలేకరులతో మాట్లాడుతూ గిరిజనుల సమస్యలపై ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అయన అన్నారు. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో అమలు అవుతున్న సంక్షేమ పథకాలను గిరిజనుల కోసం ప్రవేశపెట్టిన ప్రత్యేక పథకాలను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని ఆయన అన్నారు.వరంగల్ జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఎస్టీ మోర్చను మరింత బలోపేతం చేసేందుకు గిరిజన సోదరులతో కలిసి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఆయన అన్నారు ఈ బాధ్యతను అప్పగించినందుకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కి రాష్ట్ర బిజెపి అధ్యక్షులు రామచంద్రరావుకు తిరుపతి నాయక్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## మచ్చ గిరి గుట్ట డైరెక్టర్ ను సన్మానించిన కుమ్మరి సంఘం నాయకులు



వలిగొండ, ప్రజాస్ఫూర్తి : ఇటీవల వలిగొండ మండలం వెంకటాపురం శ్రీ మచ్చ గిరి లక్ష్మీనరసింహస్వామి వారి నూతన పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు అందులో భాగంగా వలిగొండ మండలం గోకారం గ్రామానికి చెందిన రాధారపు రమేష్ ను డైరెక్టర్ గా ఎన్నికయ్యారు ఆయన ఎన్నిక సందర్భంగా భువనగిరి కుమ్మరి సంఘం పట్టణ అధ్యక్షుడు చిన్నగాని బాలరాజ్ ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా రమేష్ మునుముందు మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో కుమ్మరి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నిర్దేశిత గడువులోగా పనులు పూర్తిచేయాలి

*** ఆలయ ప్రాచీనతకు భంగం కలగకుండా పనులు చేపట్టాలి: కలెక్టర్ అంకిత్**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: వచ్చే ఏడాది నిర్వహించనున్న గోదావరి పుష్కరాల నాటికి భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో చేపడుతున్న పునర్నిర్మాణ, అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ అంకిత్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్టతో కలసి దేవస్థానంలో జరుగుతున్న పునర్నిర్మాణ, అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పనులకు సంబంధించిన డ్రాయింగ్స్‌ను పరిశీలిస్తూ నిర్మాణాల రూపకల్పన, పనుల నాణ్యత, అమలు తీరు, పురోగతిపై అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉత్తర ద్వార దర్శనం నిర్మాణ పనులను ముక్కోటి ఏకాదశి నాటికి తప్పనిసరిగా పూర్తిచేయాలని ఆదేశించారు. అవసరమైతే అదనపు సిబ్బంది, యంత్రాలను వినియోగించి పనులను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ఆలయం నుంచి గోదావరి ఘాట్ వరకు ఉన్న మార్గంలో పుష్కరాల సందర్భంగా లక్షలాది మంది భక్తులు రాకపోకలు సాగించే నేపథ్యంలో రోడ్ల విస్తరణ, పాదచారుల మార్గాలు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సౌకర్యం, విద్యుత్ వెలుగులు, భద్రతా ఏర్పాట్లు, సూచిక బోర్డులు, ట్రాఫిక్ నిర్వహణ తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. చిత్రకూట మండపంలోని పురాతన రాతి స్తంభాలు, శిల్ప సంపదకు ఎలాంటి నష్టం కలగకుండా శాస్త్రీయ పద్ధతిలో అత్యంత జాగ్రత్తగా తొలగింపు ప్రక్రియ చేపడుతున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ వెంట భద్రాచలం తహశీల్దార్ రవికుమార్, పంచాయతీ ఈవో, ఆర్ అండ్ బి శాఖ ఈఈ నాగేశ్వరరావు, దేవాదాయ శాఖ అధికారులు, రోడ్లు, భవనాల శాఖ ఇంజినీర్లు, సంబంధిత శాఖల అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్




ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలోని ఈవీఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు జిల్లాలో ఈవీఎంల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రతి నెలా క్రమం తప్పకుండా గోడౌన్లను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. తనిఖీలో భాగంగా ఈవీఎంలు, వీవీ ప్యాట్లు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. అనంతరం సీసీ కెమెరా నియంత్రణ గదిని సందర్శించి కెమెరాల పనితీరు, రికార్డింగ్ వ్యవస్థ, విద్యుత్ బ్యాకప్, భద్రతా పర్యవేక్షణ ఏర్పాట్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గోడౌన్ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచడంతోపాటు భద్రతా ప్రమాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడకుండా అమలు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో కొత్తగూడెం ఆర్డీవో మధు, ఎన్నికల సూపరింటెండెంట్ రంగప్రసాద్, ఎన్నికల సిబ్బంది నవీన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

*** జిల్లా అదనపు కలెక్టర్ నగేష్**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు.మంగళవారం హవేలీఘనాపూర్ మండలం పోచారం అభ్యరణ్యం ను సందర్శించారు.పోచారం డ్యామ్ లోని వరద ఉధృతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ..ప్రకృతి కాపాడుకోవడం మన అందరి బాధ్యత అని ,ప్రకృతిని కాపాడినపుడు మానవ జీవితానికి ఒక సార్థకత ఉంటుందని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. జీవ వైవిధ్యం మానవ మనుగడకు జీవం అన్నారు. అనంతరం పోచారం డ్యామ్ వరద ఉధృతిని పరిశీలించి, అక్కడ ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్ సింధు రేణుక, ఆర్ ఐ సిద్ధు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థిని ఆత్మహత్య

జనగామ, ప్రజాస్ఫూర్తి : పట్టణంలోని లక్ష్మీబాయి కుంట, గిర్నిగడ్డ ప్రాంతానికి చెందిన మేడే పూజ (19), అంజయ్య కుమార్తె, మంగళవారం విషాదకర పరిస్థితుల్లో మృతి చెందింది.ఆమె సిద్దిపేట లోని సురభి కళాశాలలో బీఎస్సీ ఎంఎల్టీ చదువుతుంది. అనారోగ్య కారణంగా గత రోజుల క్రితం స్వగ్రామమైన జనగామ కు వచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం (ఆగస్టు 3) మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన పూజ, ఇంటి సమీపంలోని పాత ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఘటనాస్థలంలో లభించిన సూసైడ్ నోట్‌లో "తన మరణానికి ఎవరూ కారణం కాదని" ఆమె పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్సై నరస య్య సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘ టనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొన సాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# అంగన్వాడీ కేంద్రానికి వచ్చే తల్లి,బిడ్డల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

*** జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

ఛువనగిరి, ప్రజాస్ఫూర్తి : అంగన్వాడీ కేంద్రానికి వచ్చే తల్లి,బిడ్డల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. మంగళవారం యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని అంగడి బజార్‌లో ఉన్న అంగన్వాడీ కేంద్రం-3 ని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సందర్శించారు.ఈ సందర్భంగా కేంద్రంలో నమోదైన చిన్నారులు, గర్భిణీ స్త్రీలు, బాలింతల వివరాల సంఖ్య ఎంత అని , వారందరూ ప్రతిరోజూ కేంద్రానికి హాజరవుతున్నారా లేదా అనే వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. హాజరును ఏ విధంగా నమోదు చేస్తున్నారని , అటెండెన్స్ నిర్వహణ ను పరిశీలించారు.చిన్నారులకు ప్రతిరోజూ ఏ విధమైన పోషకాహారం ఇస్తున్నారని , చదువు,ఆటల ఏ విధంగా నేర్పిస్తున్నారని అంగన్వాడీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.




చిన్నారుల తల్లిదండ్రులతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. అనంతరం చిన్నారులకు రంగులు, బొమ్మలు చూపించి వాటి పేర్లు చెప్పించాలని ప్రోత్సహిస్తూ వారి అభ్యాస స్థాయిని పరిశీలించారు.గర్భిణీ స్త్రీలు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం సక్రమంగా అందుతున్నదా అని , పాలు, గుడ్లు, పప్పులు తదితర పోషకాహార పదార్థాలు తగినంతగా సరఫరా అవుతున్నాయా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు .అక్కడకు వచ్చిన గర్భిణీ స్త్రీలతో కలెక్టర్ మాట్లాడుతూ రక్తహీనత శాతం ఎంత ఉందని అడిగి తెలుసుకున్నారు. ఎప్పుడు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఏఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారని గర్భిణీ స్త్రీ ని కలెక్టర్ తెలుసుకున్నారు. స్కానింగ్ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని, మంచి పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలని, జిల్లా జనరల్ ఆసుపత్రిలో అనుభవజ్ఞులైన వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారని, ప్రభుత్వం కల్పిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం అంగన్వాడీ టీచర్లతో మాట్లాడుతూ విధులు నిర్వహిస్తున్న బీఎల్వోలుగా వారు ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)కు సంబంధించిన అన్ని ఫారాలను అర్హులైన ప్రతి ఒక్కరి నుంచి సేకరించాలని సూచించారు. ఇంకా మిగిలి ఉన్న వారి నుండి కూడా ఫారాలు సేకరించి, పూర్తిగా పరిశీలించి ఎలాంటి పొరపాట్లు లేకుండా సరిచూసి సమర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం లో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

*** మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి హుస్నాబాద్**



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో పురపాలక సంఘ చైర్మన్ దండి లక్ష్మి ఆధ్వర్యంలో 8 వ వార్డు లో సఫాయి అప్నా భీమారీ బగావో అనే కార్యక్రమము నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ మరియు కౌన్సిలర్లు ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు సాబ్ కార్యక్రమం గురించి అవగాహన చేశారు.అనంతరం మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ వర్షాకాలంలో సంభవించే సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త వహించాలని, పట్టణ ప్రజలందరూ వ్యక్తిగత శుభ్రతను పాటించాలని, ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిల్వ ఉన్న నీటిని ఎప్పటికప్పుడు తొలగించుకోవాలని, పాత టైర్లలో, కుండ లలో రంజాన్లలో నీరు నిలవ లేకుండా చూసుకోవాలని, చేతులను పరిశుభ్రంగా కడుకోవాలని, డయేరియా,డెంగ్యూ మలేరియా, టైఫాయిడ్ రోగాలు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఇంటి పరిసరాలలో రైన్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టమ్స్ ను ఏర్పాటు చేసుకోవాలని, చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనానికి అందించాలని, ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని, స్వచ్ఛతను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సంపత్, కాశబోయిన సరిత శానిటరీ ఇన్స్పెక్టర్ బాల ఎల్లం, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ రవి కుమార్, జవాన్ ప్రభాకర్,శ్రీకాంత్ ప్రజా ప్రతినిధులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థుల ఘర్షణపై సమగ్ర విచారణ జరపాలి: పీడీఎస్‌యూ

ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల పరస్పర ఘర్షణ, దాడి పట్ల సమగ్ర విచారణ జరపాలని, పాఠశాలలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ జిల్లా విద్యాశాఖ అధికారికి పిడిఎస్‌యు ఆధ్వర్యంలో మంగళవారం వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శులు ప్రణయ్ కుమార్, జె. గణేష్‌లు మాట్లాడుతూ టేకులపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐదు రోజుల క్రితం 10వ తరగతి విద్యార్థులు తరగతి గదిలో ఘర్షణకు దిగి పరస్పరం దాడి చేసుకున్నారన్నారు. ఈ సంఘటన తరగతులు జరుగుతున్న సమయంలోనే జరిగిందని, విద్యార్థులే వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసినట్లు చెప్పారు. ఇంత జరుగుతున్నా ప్రధానోపాధ్యాయుడు పట్టించుకోకపోవడం ఆశ్చర్యకరమని, సంఘటనపై ఎలాంటి విచారణ, వివరణ లేకుండానే ప్రధానోపాధ్యాయుడు విద్యార్థులకు టి.సి ఇచ్చి చేతులు దులుపుకున్నాడని ఆరోపించారు. పాఠశాల టీచర్ల మధ్య అనేక వివాదాలు ఉన్నాయని చెప్పారు. మధ్యాహ్న భోజనంలో పూర్తిగా నాణ్యత లోపించిందని, బాలికలకు సరిపడా మరుగుదొడ్లు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఘటనపై విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.



## గిరిజనులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

*** ఐటీడీఏ పీవో మంద మకరందు**



ఆదిలాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి : గిరిజనులకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పని చేయాలని ఉట్నూర్ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ప్రాజెక్టు అధికారి మంద మకరందు ఆదేశించారు.మంగళవారం ఆయన ఆదిలాబాద్‌లోని రాజీవ్ గాంధీ వైద్య విజ్ఞాన సంస్థ (రిమ్స్) ఆసుపత్రిని సందర్శించి గిరిజనులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. వివిధ వార్డులను సందర్శించి చికిత్స పొందుతున్న గిరిజన రోగులతో నేరుగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్య సేవల్లో ఎలాంటి లోపాలు లేకుండా ప్రతి రోగికి అవసరమైన చికిత్సను సకాలంలో అందించాలని వైద్య అధికారులను ఆదేశించారు. వార్డుల్లో నిర్వహిస్తున్న గిరిజన రోగుల రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించిన ప్రాజెక్టు అధికారి. రోగుల నమోదు, చికిత్స వివరాలు, మందుల పంపిణీ, వైద్య సేవల పురోగతిని ఎప్పటికప్పుడు సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. అనంతరం ఆదిలాబాద్‌లోని గిరిజన సహకార సంస్థ (జీసీసీ) గోదాములను సందర్శించిన ప్రాజెక్టు అధికారి, అటవీ ఉత్పత్తులు, ఇతర వస్తువుల నిల్వ విధానం, స్టాక్ రిజిస్టర్లు, భద్రతా ఏర్పాట్లు, గోదాముల నిర్వహణను తనిఖీ చేశారు. నిల్వల వివరాలను పారదర్శకంగా నిర్వహిస్తూ ప్రభుత్వ ఆస్తుల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత అధికారులకు సూచించారు.గిరిజన సంక్షేమానికి సంబంధించిన అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలు ప్రతి గిరిజన కుటుంబానికి చేరేలా కృషి చేయాలని పివో సూచించారు. ఈ తనిఖీల్లో రిమ్స్ డైరెక్టర్ డా. రాథోడ్ జైసింగ్, అదనపు జిల్లా వైద్య & ఆరోగ్య అధికారి డా. కుడిమేత మనోహర్, రిమ్స్ వైద్యులు, గిరిజన సహకార సంస్థ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో కల్తీ మసాలాల తయారీ కేంద్రాలపై దాడులు

### 25 టన్నులకు పైగా సరుకు స్వాధీనం

భాగ్యనగరంలో కల్తీ మసాలా తయారీ కేంద్రాలే లక్ష్యంగా HFAST (Hyderabad Food Adulteration Surveillance Team) బృందాలు మెరుపు దాడులు నిర్వహించినట్లు హైదరాబాద్ సీపీ సజ్జనార్ వెల్లడించారు. ప్రజల నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా చేపట్టిన ఈ ప్రత్యేక డ్రైవ్‌లో మొత్తం 13 మసాలా వ్యాపార సంస్థల్లో తనిఖీలు చేపట్టామని తెలిపారు. ఈ సోదాల్లో 25 టన్నులకు పైగా కల్తీ మసాలాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు, ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశామని చెప్పారు. మైలార్‌దేవ్‌పల్లి, బాలాపూర్ పోలీస్ స్టేషన్లలో ఇప్పటివరకు మూడు కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. తనిఖీల్లో వాము, జీలకర్ర, లవంగం, షాజీరా, ఆవాలు వంటి నిత్యం వాడే మసాలా దినుసుల్లో తీవ్రస్థాయిలో కల్తీ జరుగుతున్నట్లు గుర్తించామని సజ్జనార్ తెలిపారు. ఆకర్షణీయమైన మెరుపు, రంగు కోసం ఫ్యాబ్రిక్ డైలు, సింథటిక్ రంగులు, టాల్కమ్ పౌడర్, ఇండస్ట్రియల్ డైలు, రైస్ బ్రాన్ ఆయిల్‌ను వినియోగిస్తున్నారని వివరించారు. దాడుల సందర్భంగా సుమారు 89 టన్నుల ముడి పదార్థాలను సీజ్ చేసి, నమూనాలను ల్యాబ్ పరీక్షలకు పంపించామని తెలిపారు. కల్తీరాయుళ్లపై ఆహార భద్రత చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ పనులను పరిశీలించిన

*** మున్సిపల్ వైస్ చైర్మన్ దొంత నరేష్ గౌడ్**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: మెదక్ పట్టణంలోని 15వ వార్డులో మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్‌గౌడ్ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా పట్టణ విద్యుత్ శాఖ ఏఈ నవీన్ తో కలిసి వార్డు లోని విద్యుత్ స్తంభాల పరిస్థితిని పరిశీలించి, పునరుద్ధరణ పనులపై అధికారులతో చర్చించారు. వార్డులో పలు ప్రాంతాల్లో పాతబడిన, దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను పరిశీలించిన దొంతి నరేష్‌గౌడ్, ప్రజల భద్రత కు ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేసి వార్డు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ పట్టణ ఏఈ నవీన్, లైన్ మెన్ కృపాకర్, కాలనీ వాసులు ఇమ్రాన్, మహిపాల్, ఫయాజ్, శ్రీను, రబ్బే, ప్రసాద్, జగన్, మూర్తుజ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర బిజెపి ఓబీసీ మోర్చా అధ్యక్షులు ఆనంద్ గౌడ్ ని కలిసిన రంగా శ్రీనివాస్ గౌడ్




జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : కుత్బుల్లాపూర్ అసెంబ్లీ బిజెపి ఓబీసీ మోర్చా కన్వీనర్ గా నియమితులైన రంగా శ్రీనివాస్ గౌడ్ మంగళవారం రాష్ట్ర బిజెపి ఓబీసీ మోర్చా అధ్యక్షులు ఆనంద్ గౌడ్ ని రాష్ట్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ఇన్చార్జ్ నందనం దివాకర్ , రంగారెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షులు బుర్ర మణికంఠ , భానుచందర్ , కిషోర్ , వినోద్ , లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులకు ఎస్‌బీఐ గుడ్‌న్యూస్

*** రూ.3.31 కోట్ల వరకు ఉచిత బీమా.. ప్రత్యేక బ్యాంకింగ్ సదుపాయాలు**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, (ప్రజా స్ఫూర్తి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం, ఆర్థిక భద్రతను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ నాగరాజు తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా ఎస్‌బీఐ స్టేట్ గవర్నమెంట్ సాలరీ ప్యాకేజీ (SGSP) కింద జీతాలు పొందుతున్న ఉద్యోగులకు రూ.3.31 కోట్ల వరకు ఉచిత బీమా రక్షణతో పాటు ప్రత్యేక బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు.ఈ పథకం కింద ప్రమాదవశాత్తు మరణించిన ఉద్యోగి కుటుంబానికి రూ.1 కోటి వరకు పర్సనల్ యాక్సిడెంట్ బీమా వర్తిస్తుందని, ఇందులో పాము కాటుతో సంభవించే మరణాలు కూడా కవర్ అవుతాయని తెలిపారు. అదనంగా ప్రతి ఉద్యోగికి రూ.10 లక్షల వరకు ఉచిత గ్రూప్ టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ లభిస్తుందని చెప్పారు. శాశ్వత పూర్తి వైకల్యం సంభవిస్తే రూ.1 కోటి వరకు, పాక్షిక శాశ్వత వైకల్యానికి రూ.80 లక్షల వరకు బీమా రక్షణ ఉంటుందని పేర్కొన్నారు. దేశీయ, అంతర్జాతీయ విమాన ప్రయాణాల్లో ప్రమాదవశాత్తు మరణించిన పక్షంలో రూ.1.60 కోట్ల వరకు ఎయిర్ యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ వర్తిస్తుందని తెలిపారు. అదే విధంగా పర్సనల్, హోమ్, కార్ లోన్లు వంటి రుణాలను ఆకర్షణీయమైన వడ్డీ రేట్లతో పొందే అవకాశం కూడా ఈ ప్యాకేజీలో ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరిన ఎల్‌డీఎం నాగరాజు, పూర్తి వివరాల కోసం సమీప ఎస్‌బీఐ శాఖను సంప్రదించాలని సూచించారు.

# ప్రభుత్వ మెడికల్ కళాశాల పనులు వేగవంతం చేయాలి

*** ఎమ్మెల్యే కోవ లక్ష్మి**



కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా,ప్రజా స్ఫూర్తి: జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాలను ఎమ్మెల్యే కోవ లక్ష్మి మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. కళాశాలలోని తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయం, హాస్టల్, ఆసుపత్రి భవనం తదితర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిపై సంబంధిత ఇంజినీర్లు, అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పనుల అమలులో ఎదురవుతున్న సమస్యలను ఆరా తీశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, జిల్లా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల కీలకమని అన్నారు. నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి పనుల పురోగతిని సమీక్షించాలని, నిర్లక్ష్యం వహిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ పరిశీలనలో ఆర్అండ్‌బీ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

# సర్పంచ్ లు గ్రామాల అభివృద్ధికి పాటుపడాలి

*** ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్**




ప్రజా స్ఫూర్తి, భైంసా : నిర్మల్ జిల్లా ముధోల్ నియోజకవర్గం లోని సర్పంచ్ లు గ్రామాల అభివృద్దే ధ్యేయంగా పనిచేయాలని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ సూచించారు. మంగళవారం తానూరు ఎంపీడీవో కార్యాలయంలో మండల ప్రత్యేక సమావేశం నిర్వహించిన సందర్భంగాఆయన మాట్లాడారు. సర్పంచ్ లు అధికారులు కలిసి సమన్వయంతో పని చేస్తేనే ప్రజలకు సంక్షేమ ఫలాలు అందడంతోపాటు గ్రామ అభివృద్ధి జరుగుతుందన్నారు.సమావేశంలో సర్పంచ్ లు లేవనెత్తిన అంశాలను 45 రోజుల్లో పరిష్కరించాలని సూచించారు. గ్రామాల అభివృద్ధికి రాజకీయాలకు తీతంగా సర్పంచ్ లకు సహకరిస్తానని అన్నారు. సమావేశంలో అధికారులు శాఖల వారీగా తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు.సమావేశంలో సర్పంచ్ లు ఎమ్మెల్యే సమక్షంలో సమస్యలను అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. అంతకుముందు ఎమ్మెల్యే, ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో అధికారులు నాయకులు పాల్గొన్నారు.

# నాణ్యతతో పనులు పూర్తి చేయాలి

**: ఎమ్మెల్యే గండ్ర**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, (ప్రజా స్ఫూర్తి): భూపాలపల్లి నియోజకవర్గంలోని గణపురం మండలం గాంధీనగర్ శివారులో గుట్టపై నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు (జీఎస్సార్) మంగళవారం పరిశీలించారు. నిర్మాణ పురోగతిపై అధికారులు, గుత్తేదారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయడంతో పాటు నాణ్యత విషయంలో రాజీ పడొద్దని గుత్తేదారులను ఆదేశించారు. భవిష్యత్ తరాలకు ఉత్తమ విద్యా వాతావరణం కల్పించడమే లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# కొడవటంలో ఎమ్మెల్యే జీఎస్సార్ ప్రత్యేక పూజలు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, (ప్రజా స్ఫూర్తి): భూపాలపల్లి నియోజకవర్గంలోని రేగొండ మండలం కొడవటంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రావణమాస ఉత్సవాల సందర్భంగా ఆగస్టు 13 నుంచి సెప్టెంబర్ 11 వరకు నెల రోజులపాటు ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించనున్నట్లు ప్రకటిస్తూ రూపొందించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రావణమాస ఉత్సవాల్లో నియోజకవర్గ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నాయినేని సంపత్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇప్పకాయల నరసయ్య, పున్నం రవి, ముల్కనూరి బిక్షపతి, కాంగ్రెస్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# బానిసై బతుకు బుగ్గి చేసుకోవద్దు



ఆదిలాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి : ఆరోగ్యకరమైన యువతే తెలంగాణ రైజింగ్, వికసిత్ భారత్‌కు అసలైన బలమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. వ్యసనాలకు బానిసై బతుకు బుగ్గి చేసుకోవద్దని ఏమండీ యువతకు పిలుపునిచ్చారు. మంగళవారం ఆదిలాబాద్‌లోని బ్రహ్మకుమారీస్ నిలయంలో బ్రహ్మకుమారీస్ ఈశ్వరయ్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 'నశా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం దేశవ్యాప్తంగా బ్రహ్మకుమారీస్ చేపట్టిన 10 కోట్ల మంది వ్యసనముక్తి ప్రతిజ్ఞ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, వివిధ సంఘాల ప్రతినిధులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత్తు పదార్థాలంటే కేవలం గంజాయి, కొకైన్ మాత్రమే కాదని, మద్యం, పొగాకు, జర్దా వంటి చిన్న అలవాట్లు కూడా తీవ్ర వ్యసనాలుగా మారి జీవితాన్ని నాశనం చేస్తాయని హెచ్చరించారు. ప్రస్తుత కాలంలో ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, మొబైల్ ఫోన్ల అతిగా వాడకం వంటి డిజిటల్ వ్యసనాలు కూడా యువత భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహాత్మా గాంధీ పేర్కొన్న సామాజిక పాపాలను గుర్తు చేస్తూ,విద్యతో పాటు విలువలు,వ్యక్తిత్వ వికాసం ప్రతి ఒక్కరికీ అవసరమన్నారు. విద్యార్థులు ఉదయాన్నే లేవడం, యోగా, ధ్యానం వంటి మంచి దినచర్యలను అలవర్చుకోవాలని సూచించారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు వ్యసన విముక్తిపై అవగాహన కల్పించేందుకు ప్రతి గురువారం 'ఆరోగ్య పాఠశాల' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష మాట్లాడుతూ వ్యసనాలకు దూరంగా ఉండటమే ఆరోగ్యవంతమైన జీవితానికి పునాది అని అన్నారు. చెడు అలవాట్లు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక స్థైర్యాన్ని, ఆలోచనా విధానాన్ని దెబ్బతీస్తాయని చెప్పారు. అనంతరం నశా ముక్త్ భరాత్ పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. అలాగే అతిథులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, డీఈవో మాధవి, డిఐఈఓ గణేష్, డిపిఆర్ఓ విష్ణువర్ధన్, ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ రామాయ్య, బ్రహ్మకుమారి నిర్వాహకులు రేవతి, దిల్ రెడ్డి, లెక్రాజ్, విద్యార్థులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ విద్యార్థులకు

# గ్రామీణ కృషి అనుభవం (రావే) ఎంతో ముఖ్యం




గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమం (రావే ) లో భాగంగా ఐటీఎం యూనివర్సిటీ, మధ్యప్రదేశ్ కి చెందిన బియస్సి వ్యవసాయ డిగ్రీ కోర్సు విద్యార్థి విద్యార్థినులు గ్రామీణ వ్యవసాయ విధానాలు స్థితిగతులను తెలుసుకొని గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణ (పీఆర్ఎ) కార్యక్రమం ద్వారా అధ్యయనం చేసినట్లు కె.వి.కె శాస్త్రవేత్త డి ఆదర్శ్ తెలిపారు. గడ్డిపల్లి సొసైటీ నందు నిర్వహించిన గ్రామీణ అవగాహన సదస్సు కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విద్యార్థులు గ్రామస్తులతో సంభాషించి వారు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి తెలుసుకొని వాటి పరిష్కార మార్గాలను గ్రామ పటం, వెన్ దయాగ్రమ్, పై చార్ట్, చిత్రాల రూపంలో ప్రదర్శించి గ్రామీణ రైతులకు అవగాహన కల్పించినట్లు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో గ్రామం యొక్క వనరులను గ్రామ పటం ద్వారా చిత్రీకరించి మరియు గ్రామంలోని రైతుల వర్గీకరణ, జనాభా భౌగోళికప్రాంతం, నీటి వనరులు, వ్యవసాయ దిగుబడులు, చీడ పీడల నివారణకు ఆచరిస్తున్న యాజమాన్య పద్ధతులు మొదలగు విధానాల అంశాలపై, పైచార్ట్ లో చిత్రీకరించి రైతులకు అవగాహనా కలిపించారు. అదేవిధంగా రైతులు ఎక్కువగా ఒకే పంట పండిస్తున్నారని దాని ద్వారా భూసారం తగ్గి, పంట చీడపీడలు ఎక్కువగా పెరిగి దిగుబడులు తగ్గుతున్నాయని తెలుపుతూ పంట మార్పిడి విధానాన్ని పాటించి దిగుబడులను పొందవచ్చు అన్నారు. రైతులు ఒకే పంట కాకుండా సమగ్ర వ్యవసాయం చేస్తూ సరియైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచిదిగుబడులు పొందవచ్చునని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గడ్డిపల్లి గ్రామ సర్పంచ్ మాశెట్టి శ్రీహరి నాగలక్ష్మి, ఉప సర్పంచ్ షేక్ గులాం, కేవీకే శాస్త్రవేత్తలు డి ఆదర్శ్, పి అక్షిత్ సాయి, ఏ కిరణ్, సి.హెచ్. నరేష్, ఎన్ సుగంధి, ప్రోగ్రామ్ అసిస్టెంట్ కంప్యూటర్ ఏ నరేష్, రైతులు బట్టు సైదయ్య, బట్టిపల్లి నాగయ్య, అంజయ్య, శ్రీనివాస్, ఆకుల సందీప్, సాయిదమ్మ, వీరస్వామి, శిరీష, లక్ష్మీ, సాయిరాం, రమణ, ఆరోబిందో స్కూల్ ప్రిన్సిపల్ గోవర్ధన్ , టీచర్లు, విద్యార్థి విద్యార్థినులు నాగరాజు, యశ్వంత్ సాయి, వైష్ణవి, పవిత్ర, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# అడవి బిడ్డలపై అటవీ అధికారుల జులుం..

*** ఆగస్టు 9 లోగా శాంత్‌రామ్‌పై వేటు పడకుంటే రాష్ట్రవ్యాప్త మహా ఉద్యమం!**



ప్రజా స్ఫూర్తి, భైంసా: నిర్మల్ జిల్లా అడవి తల్లిని నమ్ముకుని జీవిస్తున్న నిరుపేద ఆదివాసులపై అటవీ శాఖ అధికారుల దాష్టీకం మితిమీరుతోందని, వారి జులుంను ఇకపై ఎంతమాత్రం సహించేది లేదని తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకగారి భూమయ్య తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మంచిర్యాల జిల్లా ఇందన్‌పల్లి పరిధిలో అమాయక నాయక పోడు గిరిజనులపై అటవీ శాఖ అధికారులు కక్షకట్టి భౌతిక దాడికి దిగడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. 'జల్, జంగల్, జమీన్' నినాదంతో తమ హక్కుల కోసం, ఆత్మగౌరవం కోసం పోరాడుతున్న అడవి బిడ్డల గొంతు నొక్కాలని చూస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. నిర్మల్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అటవీ అధికారుల తీరుపై నిప్పులు చెరిగారు.చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్న అధికారులపై క్రిమినల్ కేసులు పెట్టాలి. చట్టాన్ని రక్షించి ప్రజలకు అండగా నిలవాల్సిన అధికారులే చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని గిరిజనులను హింసించడం అత్యంత హేయమైన చర్య అని భూమయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందన్‌పల్లి ఘటనలో ఆదివాసులపై నేరుగా భౌతిక దాడికి దిగిన డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్ఓ) నిర్వాకం దుర్మార్గమైనదని పేర్కొన్నారు. దాడికి పాల్పడిన సదరు ఎఫ్ఆర్ఓను రాబోయే 24 గంటల వ్యవధిలోనే తక్షణమే ఉద్యోగం నుంచి సస్పెండ్ చేయాలని, అతనిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసుల రక్షణ కోసం చట్టాలు ఉన్నప్పటికీ, వాటిని తుంగలో తొక్కి దౌర్జన్యానికి దిగుతున్న ప్రతి అధికారికి తగిన బుద్ధి చెబుతామని స్పష్టం చేశారు.హత్యలకు, వేధింపులకు ఆయనే సూత్రధారి.. శాంత్‌రామ్‌ను సాగనంపాల్సిందే ఈ మొత్తం దాడి ఘటన వెనుక, గిరిజనులపై జరుగుతున్న వేధింపుల వెనుక టైగర్ జోన్ మరియు వన్యప్రాణి విభాగం అధికారి (FDP) శాంత్‌రామ్ పాత్ర స్పష్టంగా ఉందని భూమయ్య ఆరోపించారు. శాంత్‌రామ్ కుట్రల వల్లే ఈ ప్రాంతంలో ఆదివాసుల స్వేచ్ఛ, జీవనోపాధి దెబ్బతింటున్నాయని, ఈ అరాచకాలకు ప్రధాన సూత్రధారి ఆయనేనని మండిపడ్డారు.అందువల్ల శాంత్‌రామ్‌ను ఈ ప్రాంతం నుంచి తక్షణమే బదిలీ చేయడంతో పాటు ఆయనపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఇందుకుగాను ప్రపంచ ఆదివాసీ దినోత్సవమైన ఆగస్టు 9వ తేదీని ప్రభుత్వానికి ఆఖరి డెడ్‌లైన్‌గా విధిస్తున్నామని ప్రకటించారు.డెడ్‌లైన్ దాటితే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు తప్పవు. ఆగస్టు 9లోగా శాంత్‌రామ్‌ను ఈ ప్రాంతం నుంచి సాగనంపకుంటే, ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆదివాసీ సంఘాలు, గిరిజన మేధావులు, నాయకులను ఒకే తాటిపైకి తెచ్చి మహా ఉద్యమానికి శ్రీకారం చుడతామని తేల్చిచెప్పారు. పల్లెపల్లెనా గిరిజనులను చైతన్యపరిచి రాష్ట్రవ్యాప్త పోరాటానికి పిలుపునిస్తామని తెలిపారు. అధికారులు ఇప్పటికైనా తమ నియంతృత్వ ధోరణిని మార్చుకోవాలని, గడువులోగా బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోకపోతే ఉత్పన్నమయ్యే శాంతిభద్రతల సమస్యలకు ప్రభుత్వమే సంపూర్ణ బాధ్యత వహించాల్సి ఉంటుందని తీవ్రంగా హెచ్చరించారు. ఈ సమావేశంలో తుడుం దెబ్బ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంచు శ్రీనివాస్,జిల్లా కార్యదర్శి తోడుసం గోవర్ధన్, జిల్లా సభ్యులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ స్వతంత్ర తెలంగాణ అవగాహన ప్రచార కార్యక్రమం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, హైదరాబాద్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య మాసాన్ని పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న "సురక్ష కా తిరంగా - సైబర్ స్వతంత్ర తెలంగాణ" సైబర్ అవగాహన ప్రచార కార్యక్రమాన్ని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఆగస్టు, 05, మధ్యాహ్నం 12.00 గంటలకు మహబూబాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆడిటోరియంలో ప్రారంభించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ,ఆగస్టు నెల మొత్తం జిల్లాలో సైబర్ నేరాల నివారణపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించడం, సైబర్ నేరాలను నివారించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు.ఇటీవలి కాలంలో స్టాక్ ఇన్వెస్ట్మెంట్ మోసాలు, బిజినెస్ ఇన్వెస్ట్మెంట్ మోసాలు, ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసాలు, డిజిటల్ అరెస్ట్, ఫేక్ లోన్ యాప్‌లు, ఓటీపీ, కేవైసీ, సోషల్ మీడియా, ఉద్యోగాల పేరుతో జరిగే మోసాలు అధికంగా జరుగుతున్నందున ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు."సురక్ష కా తిరంగా" ప్రచార సందేశమైన "ఆగు - ఆలోచించు - నిజం నిర్ధారించు - సైబర్ భద్రత పెంచు" అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరించాలని పిలుపునిచ్చారు.సాధారణ ప్రజల భాగస్వామ్యంతో సైబర్ భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

# మహనీయుల విగ్రహాల చుట్టూ ఉన్న రైలింగ్ తొలగించిన కాంట్రాక్టర్

*** దళిత సంఘాల ఆందోళనతో మళ్లీ రైలింగ్ వేసిన కాంట్రాక్టర్**



ప్రజాస్ఫూర్తి, నల్లగొండ: నల్లగొండ సమీపంలోని మర్రిగూడ బైపాస్ సమీపంలో బైపాస్ లో ఉన్న బుద్ధ వనంలోని బాబాసాహెబ్ అంబేద్కర్ బాపు జగ్జీవన్ రామ్ బుద్ధుని విగ్రహాల చుట్టూ ఉన్న రైలింగును బైపాస్ రోడ్ కాంట్రాక్టర్ తొలగించి ఆ మహనీయుల విగ్రహాలను పక్కకు మార్చాలని ప్రయత్నాన్ని దళిత సంఘాలు అడ్డుకోవడంతో యుద్ధ ప్రాతిపదికన వెంటనే మళ్ళీ రైలింగ్ ను నిర్మించిన సంఘటన మంగళవారం బైపాస్ వద్ద చోటుచేసుకుంది. రోడ్డు వెడల్పు కార్యక్రమంలో భాగంగా జాతీయ నాయకుల విగ్రహాలను తొలగించే కార్యక్రమంలో కాంట్రాక్టర్ కమిటీ సభ్యులకు తెలియకుండా అంబేద్కర్ బుద్ధవనం చుట్టూ ఉన్న ట్రాకును తొలగించే కార్యక్రమంలో ఆ గ్రామానికి చెందిన గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ సంఘం మాజీ అధ్యక్షులు 14వ డివిజన్ టిఆర్ఎస్ పార్టీ నాయకులు బొజ్జ వెంకన్న పిలుపుమేరకు కాంట్రాక్టు మిషన్లు అడ్డుకొని పని బంద్ చేసి ధర్నా చేశారు . కాంట్రాక్టర్లను వారిని ప్రోత్సహిస్తున్నటువంటి నాయకులు మీద ఎస్సీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని దళిత సంఘాల డిమాండ్ చేశారు. దీంతో పోలీసులు ఆర్డీవో దళిత సంఘాలతో చర్చలు జరిపి మళ్లీ రైలింగ్ వేపిస్తామని హామీ ఇచ్చి రైలింగ్ వెంటనే వివరించారు దీంతో ఆందోళనకారులు సద్దుమణి గారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు పెరికరం జయరాజ్ కుల వివక్షత పోరాట కమిటీ జిల్లా నాయకులు పాలడుగు నాగార్జున ఎమ్మార్పీఎస్ ఉద్యమ నాయకులు నల్లగొండ జిల్లా అధ్యక్షులు మాదిగ జిల్లా బీసీ నాయకులు అయితగోని జనార్దన్ గౌడ్ యాదవ సంఘం నాయకులు సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి బొజ్జ మహేష్ గారు ఎంపిటిసి కడారి యాదయ్య గారు మాజీ కౌన్సిలర్ గుండు రాధిక యుగేందర్ రెడ్డి గారు కార్పొరేటర్ దొడ్డి రమేష్ 15వ వార్డ్ అంబేద్కర్ సంఘం అధ్యక్షులు కత్తుల సహదేవ్ ప్రధాన కార్యదర్శి బొజ్జ నాగయ్య దీపంగి యాదయ్య మాజీ అధ్యక్షులు జేరిపోతుల అశోక్ గౌడ్ ఎమ్మార్పీఎస్ నాయకులు బొజ్జ దేవయ్య బొజ్జ ఖతర్నాక్ తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రి జిల్లాలో ప్రతి ఎకరాకు సీతారామ జలాలు అందించాలి

*** సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా**




ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం: సీతారామ ప్రాజెక్టు ద్వారా జిల్లాలోని ప్రతీ ఎకరానికి సాగునీరు అందించి జిల్లా రైతాంగాన్ని ఆదుకోవాలని, ప్రాజెక్టుల నిర్మాణంలో భూములు కొల్పిన నిర్వాసితులకు న్యాయం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇల్లందు, పినపాక, అశ్వారావుపేట, కొత్తగూడెం, భద్రాచలం నియోజకవర్గాల్లోని చెరువులను నింపి సాగునీరు అందించాలని , నిత్యవసర వస్తువులు, పెట్రో ఉత్పత్తుల ధరలను నియంత్రించాలని, పంటలకు కనీస మద్దతు ధరను చట్టబద్ధం చేయాలన్నారు. కేంద్రం మార్చిన 44 కార్మిక చట్టాలను రద్దు చేయాలని, విద్య, ఉపాధి హక్కులను రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులుగా చేర్చడంతో పాటు జిల్లాలోని పల సమస్యలపై సీపీఐ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఆగస్టు 6 నుండి 14 వరకు "ప్రజా చైతన్య యాత్రలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సెప్టెంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో లక్షలాది మందితో "దేశంలో మార్పు కోసం" భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. యాత్రలకు అన్నివర్గాల ప్రజలు సంఘీభావం తెలపాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు పాల్గొన్నారు .

# పారిశుధ్యం పై ప్రత్యేక ధ్రుష్టి పెట్టాలి : ఎంపీడీవో



ప్రజా స్ఫూర్తి, భైంసా : నిర్మల్ జిల్లా లక్ష్మణచందా ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం స్పెషల్ అఫీసర్ శంకర్ జీపీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సూచంచారు. వన మహోత్సవాన్ని వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం కస్తూర్బా బాలికల పాఠశాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు.

## పేట ప్రజలను అలరించనున్న జలకన్య ఎగ్జిబిషన్



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: జిల్లా కేంద్రంలో మెట్రో ట్రేడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జలకన్య ఎగ్జిబిషన్ సూర్యాపేట జిల్లా ప్రజలను అలరించే విధంగా ఉందని ఏఐసిసి సభ్యులు రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మాజీ టూరిజం చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, సూర్యాపేట మున్సిపల్ చైర్ పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్ష్మాది అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 36వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీలో ఏర్పాటుచేసిన జలకన్య ఎగ్జిబిషన్ వారు ప్రారంభించి మాట్లాడారు. చిన్నలను పెద్దలను అలరించేలా జలకన్య షోతో పాటు ఆనందాన్ని పంచే జెయింట్ వీల్, బ్రేక్ డాన్స్, అందరికీ ఉపయోగపడే స్టాల్స్ తో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి ఎగ్జిబిషన్లో ఏర్పాటు చేసే వారికి తమ సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. సూర్యాపేట పట్టణ ప్రజలు జలకన్య ఎగ్జిబిషను సందర్శించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జ్యోతి కరుణాకర్, షేక్ ఫారుక్, పాలగాని కృష్ణ, నిర్వాహకులు అంకిత్, ఫిరోజ్, అలా మ్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్య సిబ్బంది సమయపాలన పాటించి విధులు నిర్వహించాలి

* **జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రవి రాథోడ్**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : వైద్య సిబ్బంది సమయపాలన పాటించి విధులు నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రవి రాథోడ్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ లోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రవి రాథోడ్ జిల్లాలోని మండల ప్రాథమిక వైద్యాధికారులతో గూగుల్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో గూడూరు, కోమట్ల గూడెం, కొత్తగూడ, తీగల వేణి, గంగారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 24 గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని, ప్రత్యేకమైన సీజనల్ వ్యాదులలో భాగంగా విష జ్వరాలు, అతిసారం,పాము, తేలు కాటు మందులు అందుబాటులో ఉన్నాయని, ప్రత్యేకంగా డెంగ్యూ ,మలేరియా జ్వరముల వార్డులను ఏర్పాటు చేయడం జరిగిందని, వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులు నిర్వహించవలసిందిగా సూచిస్తూ, జాతీయ ఆరోగ్య కేంద్రాల పథకాలపై సమీక్షించి, లక్ష్యాలు సాధించాలని సూచించినారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఏఎన్ఎంలు, ఆశలు అంగనవాడి సిబ్బంది సమన్వయంతో తల్లి పాల ప్రాముఖ్యత లో కాన్పు కాగానే బిడ్డకు తల్లిపాలు(ముర్రిపాలు) పట్టించవలసిందిగా, ఈ పాలు మొదటి టీకా వలె వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని, జ్వరాల నియంత్రణలో భాగంగా ఇంటింటి సర్వే ద్వారా ఉండకుండా డ్రై డే కార్యక్రమం నిర్వహిస్తూ గ్రామపంచాయతీ సిబ్బంది సమన్వయంతో పరిసరాల పరిశుభ్రత,దోమల పుట్టకుండా కుట్టకుండా జాగ్రత్తలపై అవగాహన శిబిరాలు ఏర్పాటు చేయవలసిందిగా సూచించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ శివకుమార్, డిప్యూటీ డెమో రాజ్ కుమార్, స్వామి, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు, సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు,ఆశాలు పాల్గొన్నారు.



# షుగర్ పేషెంట్లు పండ్లు తినొచ్చా?

పండ్లలో కార్బొహైడ్రేట్లు ఎక్కువగా ఉంటాయి. వీటిని తిన్నప్పుడు గ్లూకోజ్ అనే షుగర్‌గా కార్బ్సు మారతాయి. కొన్ని పండ్లలో షుగర్ ఎక్కువగా ఉంటుంది. అందుకే ఇవి తిన్నప్పుడు అది రక్తంలోకి చేరి.. బ్లడ్ షుగర్ లెవెల్స్ పెరిగేందుకు కారణం కావొచ్చు. అందుకే డయాబెటిస్ ఉన్న వారు ఎక్కువగా పండ్లు తినొచ్చా లేదా అనే సందేహం ఉంటుంది.



### పండ్లతో పాటు ఇవి కూడా..

పండ్లు తినడం వల్ల రక్తంలో షుగర్ లెవెల్స్ కాస్త పెరుగుతాయి. ఫైబర్ ఈ ప్రక్రియను తగ్గించడంలో సహకరించినా.. కాస్త షుగర్ స్థాయి అధికమయ్యే అవకాశం ఉంటుంది. హెల్దీ ఫ్యాట్స్ లేదా ప్రొటీన్ ఎక్కువగా ఉండే ఆహారాలతో పండ్లను డయాబెటిస్ ఉన్న వారు తినవచ్చని సుబ్రతా దాస్ తెలిపారు. “డయాబెటిస్ లేదా ఇన్సులిన్ రెసిస్టెంట్స్ ఉన్న వారిపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా గ్లైసెమిక్ ఇండెక్స్ ఎక్కువగా ఉన్న ఫుడ్స్ తిన్నాక ఇలా జరుగుతుంది. అయితే, హెల్దీ ఫ్యాట్స్ లేదా ప్రొటీన్ ఎక్కువగా ఉన్న ఆహారాలతో కలిపి పండ్లను తినడం వల్ల గ్లైసెమిక్ రెస్పాన్స్ తగ్గుతుంది. దీంతో బ్లడ్ షుగర్ లెవెల్స్ తక్కువగా ఉంటాయి. బ్లడ్ షుగర్ తటస్థంగా ఉండడం ఎక్కువగా ఫ్యాట్, ప్రొటీన్‌పై ఆధారపడి ఉంటుంది. బ్లడ్ షుగర్ స్థాయిలు స్థిరంగా ఉండేలా ప్రొటీన్ చేయగలదు. కార్బోహైట్రేడ్ల ప్రక్రియను ఫ్యాట్ నెమ్మదయ్యేలా చేస్తుంది” అని సుబ్రదా దాస్ పేర్కొన్నారు. బాదం, ఆక్రోటు లాంటి నట్స్, సీడ్స్, పప్పు ధాన్యాలు, యగర్ట్, కోడిగుడ్లు, ఫ్యాటీ ఫిష్ లాంటి ఆహారాల్లో హెల్దీ ఫ్యాట్స్, ప్రొటీన్ ఎక్కువగా ఉంటాయి.

### హెల్దీ ఫ్యాట్స్ ఉన్న ఫుడ్స్ మేలు

ఆరోగ్యకరమైన ఫ్యాట్స్ ఉండే ఆహారాలు తినడం వల్ల చాలా ప్రయోజనాలు ఉంటాయి. “నట్స్, అవకాడో, కోడిగుడ్డు సొన, ఆలివ్ ఆయిల్ లాంటి వాటిలో హెల్దీ ఫ్యాట్స్ ఎక్కువగా ఉంటాయి. వీటి వల్ల గుండె పనితీరు మెరుగవుతుంది. ఇవి తింటే ఎక్కువసేపు ఎనర్జీ ఉంటుంది. శరీరంలో నేచురల్ హర్మోన్ కోర్టిసాల్ ఉదయం ఎక్కువగా ఉంటుంది. అప్పుడు ఈ హెల్దీ ఫ్యాట్స్ ప్రయోజనకరంగా ఉంటాయి. ఇవి తీసుకుంటే ఒత్తిడి తగ్గుతుంది. కార్బ్సు కాకుండా ఉదయం ఫ్యాట్స్ తీసుకుంటే బ్లడ్ షుగర్ లెవెల్స్ అదుపులో ఉండేందుకు సహకరిస్తాయి. కార్బ్సు ఎక్కువగా తీసుకుంటే ఆ లెవెల్స్ ఎక్కువవుతాయి. అందుకే డయాబెటిస్ ఉన్న వారు హెల్దీ ఫ్యాట్స్ ఉన్న ఫుడ్స్ తినడం చాలా ముఖ్యం” అని డాక్టర్ సుబ్రతా దాస్ చెప్పారు.

శరీరంలో ఇన్సులిన్ రెసిస్టెంట్‌ను, విటమిన్లు శోషించుకునే గుణాలను హెల్దీ ఫ్యాట్స్ మెరుగుపరుస్తాయని సుబ్రతా దాస్ వెల్లడించారు. పేగుల ఆరోగ్యానికి, రోగ నిరోధక శక్తికి కూడా మేలు చేస్తాయని చెప్పారు. నెయ్యి, వెన్నె, కొబ్బరి నూనె, అవకాడో ఆయిల్‌లోనూ హెల్దీ ఫ్యాట్స్ ఎక్కువగా ఉంటాయన్నారు. నట్స్, నట్స్ బటర్ కూడా ఆహారంలో తీసుకోవచ్చని చెప్పారు. ఫ్రైడ్ ఫుడ్స్, కార్బొహైడ్రేట్లు ఎక్కువగా ఉండే బ్రెడ్, పాస్తా, పిజ్జా లాంటివి తినకూడదని తెలిపారు.



# చలికాలంలో ఈ నూనె వాడండి



చలికాలం అతిత్వరలో వచ్చేస్తోంది. ఇప్పటికే కాస్త చలి మొదలైంది. ఈ కాలంలో వాతావరణం చల్లగా మారిపోతుంది. దీనివల్ల చర్మ సమస్యలు ఎక్కువగా ఎదురవుతాయి. చర్మం పొడిబారడమే కాకుండా మరిన్ని ఇబ్బందులు వస్తాయి. అయితే, ఈ కాలంలో బాదం నూనె (ఆల్మండ్ నూనె) చాలా ఉపయోగపడుతుంది. అందుకే చలికాలం రాకముందే ఈ నూనెను తెచ్చిపెట్టుకోంది. చర్మానికి బాదం నూనె ఏ ప్రయోజనాలు కల్పిస్తోందో ఇక్కడ తెలుసుకోండి.

### చర్మం పొడిబారకుండా..

### మెరుపు ఉండేలా

బాదం నూనె చర్మానికి తేమను అందజేస్తుంది. చలికాలంలో చర్మాన్ని పొడిబారకుండా చేయగలదు. నిద్రపోయే ముందు చర్మానికి బాదం నూనె రాసుకోండి. ఈ నూనెలో ఫ్యాటీ యాసిడ్స్ అధికంగా ఉంటాయి. దీంతో తేమను లాక్ చేసి ఉంచుతుంది. చర్మం పొడిబారదు. చర్మం మెరుపుతో ఉంటుంది. రెండు చేతుల్లో బాదం నూనె వేసుకొని కాస్త రుద్ది ముఖానికి పూసుకోవాలి.

### కళ్ల కింద వలయాలకు..

కళ్ల కింద నల్లటి వలయాల్లా ఉండే డార్క్ సర్కిల్స్ సమస్యను ఆల్మండ్ ఆయిల్ తగ్గించదలదు. మీరు నిద్రించే ముందు ప్రతీ రోజు కళ్లు కింద ఈ నూనెను రాసుకోండి. రెండు వారాల్లోనే ఫలితం కనిపించే అవకాశం ఉంటుంది.

### ట్యాన్ తగ్గేందుకు ఇలా..

చర్మంపై కమిలినట్టుగా నల్లగా ఏర్పడే ట్యాన్ తగ్గేందుకు కూడా బాదం నూనె ఉపయోగపడుతుంది. సమాన మోతాదులో కొన్ని చుక్కల బాదం నూనె, నిమ్మ రసం, కాస్త తేనెను కలుపుకోవాలి. ఆ మిశ్రమాన్ని ట్యాన్ ఏర్పడిన చోట పూయాలి. కొన్ని రోజుల్లోనే దీని సానుకూల ప్రభావాన్ని చూడొచ్చు.

### మడమ పగుళ్లకు కూడా..

మడమ పగుళ్లకు కూడా బాదం నూనె వాడొచ్చు. పగిలిన మడమలకు ఈ నూనె రాత్రి వేళ రాయాలి. రాత్రంగా అలాగే వదిలేయాలి. ఉదయాన్నే గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఇలా చేస్తే ఏవైనా ఇన్ఫెక్షన్ ఉంటే తొలగిపోతుంది. స్కిన్ రాషెష్‌కు కూడా ఈ నూనె ఉపయోగించవచ్చు. బాదం నూనెతో ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు.

### స్ట్రెచ్‌మార్క్స్ తగ్గేందుకు..

బాదం నూనెలో విటమిన్ ఈ పుష్కలంగా ఉంటుంది. అందుకే ఈ నూనె స్ట్రెచ్‌మార్క్స్ తగ్గించగలదు. స్ట్రెచ్‌మార్క్స్ ఏర్పడిన చోట కాస్త బాదం నూనె వేసి మసాజ్ చేయాలి. స్నానం చేసిన వెంటనే ఇలా చేయాలి.

### పెదాలకు..

చలికాలంలో పెదాలు పగలడం కూడా సమస్యగా ఉంటుంది. దీనికి కూడా బాదం నూనె ఉపయోగపడుతుంది. పెదాలకు ఈ నూనె రాసుకోవాలి. పెదాలు నల్లగా కాకుండా కూడా ఈ నూనె చేయగలదు. మచ్చలను కూడా తగ్గించగలదు.






# ఎయిర్‌టెల్ లాభం రూ.8,167 కోట్లు

ప్రముఖ టెలికాం కంపెనీ భారతీ ఎయిర్‌టెల్ ఈ ఏడాది జూన్ త్రైమాసిక ఫలితాలను వెల్లడించింది. పన్ను అనంతరం రూ.8,167 కోట్ల లాభాన్ని ఆర్జించింది. గతేడాది ఇదే కాలంలో నమోదైన రూ.5,948 కోట్లతో పోలిస్తే 37.3 శాతం వృద్ధిని నమోదు చేసింది. భారత్‌తో పాటు ఆఫ్రికా కార్యకలాపాలు బలంగా పుంజుకోవడమే ఇందుకు కారణంగా కంపెనీ పేర్కొంది. కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయం రూ.49,462.6 కోట్ల నుంచి 18.3 శాతం వృద్ధి చెంది రూ.58,539 కోట్లకు చేరింది. మే నెలతో పోలిస్తే 5.7 శాతం పెరిగింది. ఒక యూజర్




నుంచి వచ్చే సగటు ఆదాయం (ARPU) 5.6 శాతం వృద్ధితో రూ.250 నుంచి రూ.264కు చేరింది.

# E20 విషయంలో ముందుకే.. రాజ్యసభకు తెలిపిన కేంద్రం

ఢిల్లీ: ఇ20 పెట్రోల్ విషయంలో వెనక్కి వెళ్లే అవకాశం లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టంచేసింది. ఈ మేరకు రాజ్యసభకు లిఖిత పూర్వకంగా తెలియజేసింది. ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ అడిగిన ప్రశ్నకు పెట్రోలియం శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపి లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. ఇ20 నుంచి ఇ0/ఇ10 పెట్రోల్‌కు తిరిగి వెళ్లే ఆలోచన లేదని కేంద్రం పేర్కొంది. పెట్రోల్‌లో ఇథనాల్ బ్లెండింగ్ కార్యక్రమం నీతి ఆయోగ్, వాహన తయారీదారులు, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు, ARAI, SIAM వంటి సంస్థలతో విస్తృతంగా చర్చించి శాస్త్రీయంగా ఆమోదించి తీసుకున్న నిర్ణయమని తెలిపింది.



ఇ20 పెట్రోల్‌ను ఆప్షనల్‌గా ఇవ్వొచ్చన్న ప్రశ్నకూ కేంద్రం వివరణ ఇచ్చింది. దేశవ్యాప్తంగా లక్షకు పైగా ఉన్న రిటైల్ ఔట్‌లెట్లలో E0, E10, E20 పెట్రోల్‌ను ఒకేసారి వేర్వేరుగా సరఫరా చేయడం వల్ల రవాణా సమస్యలు తలెత్తుతాయని, సరకు నిల్వ, నిర్వహణ ఖర్చులు గణనీయంగా పెరుగుతాయని కేంద్రం పేర్కొంది. మైలేజీపై వస్తున్న ఆరోపణలకూ సమాధానం ఇచ్చింది. ఇ10 డిజైన్ వాహనాల్లో మైలేజీ 35 శాతం మేర మైలేజీ తగ్గే అవకాశం ఉన్నప్పటికీ, E20 పెట్రోల్లో అధిక ఆక్టేన్ కారణంగా మెరుగైన యాక్సిలరేషన్‌ను లభిస్తుందని పేర్కొంది. ఇ10తో పోలిస్తే ఇ20 వల్ల కర్బన ఉద్గారాలు సుమారు 30 శాతం వరకు తగ్గుతాయని కేంద్రం వివరించింది. దేశంలో 20 కోట్లకు పైగా ద్విచక్ర వాహనాలు, 3 కోట్లకు పైగా పెట్రోల్ కార్లు ఈ ఇంధనాలతో నడుస్తున్నప్పటికీ, ఇంధనం వల్ల ఇంజిన్ పాడైపోయినట్లు ఎటువంటి రుజువూ లేదని కేంద్రం స్పష్టంచేసింది. వాహన తయారీదారులు ఇ20 పెట్రోల్ వాడే వాహనాలకు కూడా తమ వారంటీ నిబంధనలను యథావిధిగా వర్తింపజేస్తున్నాయని తెలిపింది. ఇథనాల్ బ్లెండింగ్ వల్ల రూ.1.97 లక్షల కోట్లకు పైగా విదేశీ మారక ద్రవ్యం ఆదా అయ్యిందని తెలిపింది. సుమారు 316 లక్షల మెట్రిక్ టన్నుల ముడి చమురు అవసరం తగ్గిందని, 952 లక్షల మెట్రిక్ టన్నుల కర్బన ఉద్గారాలు తగ్గుముఖం పట్టాయని పేర్కొంది.

# ఆరోగ్యకర అలవాట్లతో 100% ప్రీమియం వాపస్.. ఆదిత్య బిర్లా కొత్త పాలసీ



కోల్‌కతా: యువకులే లక్ష్యంగా ఆదిత్య బిర్లా హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ నూతన బీమాను ప్రవేశపెట్టింది. 2535 ఏళ్ల వయసున్న వారి కోసం 'యాక్టివ్ యువ' పేరిట కొత్త ఆరోగ్య బీమా పాలసీని తీసుకొచ్చింది. ఆస్పత్రి ఖర్చులను భరించడంతో పాటు, పాలసీదారుల్లో ఆరోగ్యకర అలవాట్లను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ పాలసీని తీసుకొచ్చినట్లు కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మయాంక్ బత్వల్ తెలిపారు. దేశ జనాభాలో 2535 వయసు కలిగిన యువత 65 శాతం ఉంటే.. బీమా తీసుకునే వారి సంఖ్య 15 శాతమే ఉంటోందని మయాంక్ అన్నారు. వారిని ఆరోగ్యబీమా పాలసీ తీసుకునేలా 'యువ క్రెడిట్'ను డిజైన్ చేసినట్లు తెలిపారు. 11 ఏళ్లలో 11 రెట్ల బీమా హామీ మొత్తాన్ని పెంచుకోవచ్చన్నారు. ఏడాదిలో ఐదుసార్లు ఓపీడీ ఖర్చులు, హాస్పిటలైజేషన్ సమయంలో ఆదాయానికి రక్షణ, ప్రపంచవ్యాప్తంగా మెటర్నిటీ కవరేజీ, ఇతర దేశాలకు ప్రయాణించేటప్పుడు తాత్కాలికంగా పాలసీని నిలిపివేసే సదుపాయం వంటివి ఇందులో ఉన్నాయన్నారు. ముఖ్యంగా ఆరోగ్యకర అలవాట్లు పాటించే వారికి రివార్డు ఇవ్వడం ఈ పాలసీ లక్ష్యమని బత్వల్ అన్నారు. ఆహారం, ఫిట్‌నెస్ గోల్స్ చేరుకోవడం, తగినంతసేపు నిద్ర పోవడం వంటి అలవాట్లు కలిగిన వారికి వార్షిక ప్రీమియాన్ని నూరు శాతం తిరిగి చెల్లిస్తామన్నారు.

# 50 లక్షల ఇళ్లపై సౌరఫలకాలు.. 19 లక్షల కుటుంబాలకు జీరో బిల్లు

ఇంటి పైకప్పుపై సౌర ఫలకాలు ఏర్పాటు చేసుకొని విద్యుత్ బిల్లులు తగ్గించుకునేందుకు ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్: ముఫ్త్ బిజిలీ యోజన అరుదైన మైలురాయిని అందుకుంది. ఈ పథకం కింద దేశవ్యాప్తంగా దాదాపు 50.06 లక్షలకు పైగా కుటుంబాలు లబ్ధిపొందగా.. వారిలో 19 లక్షల కుటుంబాలు జీరో బిల్లును అందుకుంటున్నాయి. రూ.28,024 కోట్ల సబ్సిడీ సొమ్ము నేరుగా వారి ఖాతాలో జమ చేసినట్లు పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ పేర్కొంది. రూఫ్‌టాప్ సోలార్‌ను ప్రోత్సహించే లక్ష్యంతో 2024 ఫిబ్రవరిలో కేంద్రం ఈ పథకాన్ని తీసుకొచ్చింది. 202627 నాటికి మొత్తం కోటి కుటుంబాలకు లబ్ధి చేకూర్చడం దీని ఉద్దేశం.



2026 ఇప్పటివరకూ 50.06 లక్షల కుటుంబాలు ఈ పథకంలో చేరగా.. జులైలో ఏకంగా 5.06 లక్షల గృహ వినియోగదారులు రూఫ్‌టాప్ సోలార్‌ను ఏర్పాటు చేసుకున్నట్లు మంత్రిత్వశాఖ వెల్లడించింది. ప్రస్తుతం ప్రతి 6 రోజులకు లక్ష కొత్త కుటుంబాలు ఈ పథకంలో చేరుతున్నట్లు వెల్లడించింది. దీని ద్వారా ఇప్పటివరకు 14.8 గిగావాట్ సామర్థ్యం కలిగిన రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేశారు. 12 లక్షలకు పైగా కుటుంబాలు అదనపు విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించి ఏడాదికి సగటున రూ.3,500 అదనపు ఆదాయాన్ని పొందుతున్నాయి. ఈ స్కీమ్‌లో చేరడానికి గృహ వినియోగదారులంతా అర్హులే. ఒకసారి ప్యానళ్లను పెట్టుకుంటే 25 సంవత్సరాల వరకు గ్యారెంటీ ఉంటుంది. ఒక కిలోవాట్ ప్లాంటు పెడితే రూ.30 వేల సబ్సిడీ లభిస్తుంది. రెండు కిలోవాట్లు అయితే రూ.60 వేలు, మూడు లేదా అంతకన్నా ఎక్కువైతే రూ.78 వేలు ఇస్తారు.

# వన్‌ప్లస్ సేల్: ఈ స్మార్ట్‌ఫోన్లపై రూ.5వేల వరకు డిస్కౌంట్

ప్రముఖ స్మార్ట్‌ఫోన్ తయారీ కంపెనీ వన్‌ప్లస్ లవర్స్‌కు గుడ్‌న్యూస్ . స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 7 నుంచి ఈ సంస్థ ఇండిపెండెన్స్ డే సేల్‌ను నిర్వహించనుంది. ఇందులో వివిధ రకాల స్మార్ట్‌ఫోన్లపై రూ.5వేల వరకు డిస్కౌంట్ అందిస్తోంది. దీంతో పాటు వన్‌ప్లస్ బడ్స్, ట్యాబ్‌లపైనా ఆఫర్లు ప్రకటించింది. మెమొరీ చిప్‌ల కొరత కారణంగా స్మార్ట్‌ఫోన్ ధరలు ఆకాశాన్ని తాకుతున్న వేళ ఈ సేల్‌ను ప్రకటించడం గమనార్హం. కాగా.. ఈ సేల్ ఎప్పటి వరకు కొనసాగుతుందనేది మాత్రం కంపెనీ ఇంకా వెల్లడించలేదు.

**స్మార్ట్‌ఫోన్లపై ఆఫర్లు ఇవే..**

వన్‌ప్లస్ 15ఆర్ మోడల్ ప్రారంభ ధర రూ.59,999గా ఉండగా.. ఆఫర్‌పై రూ.3 వేల డిస్కౌంట్ ఇవ్వనుంది. వన్‌ప్లస్ 13ఎస్ ఫోన్ ధర రూ.54,999 ఉండగా.. రూ.49,999కు విక్రయించనుంది. ఈ స్మార్ట్‌ఫోన్‌పై గరిష్ఠంగా రూ.5 వేలు డిస్కౌంట్ ప్రకటించింది. వన్‌ప్లస్ 15 స్మార్ట్‌ఫోన్ ధర రూ.85,999 ఉండగా.. సేల్‌లో రూ.81,999కు కొనుగోలు చేయొచ్చు. ఈ ఏడాది విడుదలైన వన్‌ప్లస్ Nord 6ను రూ.41,999కు, Nord CE 6ను రూ.31,999, Nord CE 6 Lite రూ.23,749కు వన్‌ప్లస్ ఆఫర్‌లో విక్రయించనుంది. వన్‌ప్లస్ N6ను రూ.20,999, వన్‌ప్లస్ N6xను రూ.17,499కు కొనుగోలు చేయొచ్చని కంపెనీ ప్రకటించింది.

# ద్రవిడ్‌లాగే రహానేకు ఎప్పుడూ గుర్తింపు దక్కలేదు: సునీల్ గవాస్కర్

ఇటీవల అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు వీడ్కోలు పలికిన అజింక్య రహానేకు దక్కాల్సిన గుర్తింపు ఎప్పుడూ దక్కలేదని దిగ్గజ ఆటగాడు సునీల్ గవాస్కర్ అభిప్రాయపడ్డాడు. ''కెప్టెన్‌గా రహానేకు అద్భుతమైన రికార్డు ఉంది. అతను ఆరు టెస్టులకు సారథ్యం వహించగా.. నాలుగు విజయాలు సాధించాడు. ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోలేదు. రాహుల్ ద్రవిడ్ సారథ్యంలోనూ అద్భుతమైన విజయాలు నమోదైనప్పటికీ అతనికి దక్కాల్సిన గుర్తింపు లభించలేదు. అలాగే రహానే నాయకత్వానికి కూడా పెద్దగా ప్రశంసలు దక్కలేదు. భారత క్రికెట్‌లో ఇది సర్వసాధారణం. జట్టు గెలిచినప్పుడు వ్యక్తిగత ప్రతిభ కనబరిచిన బ్యాటర్లు లేదా బౌలర్లకే ప్రశంసలు దక్కుతాయి. కానీ జట్టు ఓడిపోయినప్పుడు మాత్రం కెప్టెన్, కోచ్‌లే నిందలు మోయాల్సి వస్తుంది. 2021 ఆస్ట్రేలియా పర్యటనలో మొదటి టెస్టులో టీమ్‌ఇండియా కేవలం 36 పరుగులకే కుప్పకూలి తీవ్ర నిరాశలో కూరుకుపోయింది. తదుపరి మ్యాచ్‌ల్లో కోచ్ రవిశాస్త్రితో కలిసి జట్టును ఆ పరిస్థితి నుంచి



మెరుగైన స్థితికి చేర్చింది రహానేనే. జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు కెప్టెన్సీ పగ్గాలు చేపట్టి గెలుపుబాట పట్టించాడు. ఆస్ట్రేలియాకు కంచుకోట లాంటి బ్రిస్బేన్ గబ్బా మైదానంలో భారత్‌కు అపూర్వమైన విజయాన్ని అందించడమే కాకుండా సిరీస్‌నూ సాధించిపెట్టాడు. నిజానికి ఆ సిరీస్‌లో చివరి మ్యాచ్‌కు అగ్రశ్రేణి ఆటగాళ్లు గాయాలు, వ్యక్తిగత కారణాలతో అందుబాటులో లేరు. అయినప్పటికీ భారత్ తన టెస్టు క్రికెట్ చరిత్రలో ఒక గొప్ప విజయాన్ని అందుకుంది. రహానే నిస్వార్థమైన ఆటతీరుకు అభిమానుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. అతను సగర్వంగా ఆట నుంచి నిష్క్రమించాడు. ఆటలో ఒక్క శత్రువు కూడా లేని క్రికెటర్లు నాకు తెలిసి అరడజను కంటే తక్కువమందే ఉంటారు. వారిలో రహానే ఒకడు'' అని గవాస్కర్ పేర్కొన్నాడు.




# శ్రీలంకతో టెస్టు సిరీస్.. టీమ్‌ఇండియా నెట్ బౌలర్లుగా నలుగురు స్పిన్నర్లు

ఆగస్టు 15 నుంచి శ్రీలంకతో భారత్ రెండు టెస్టుల సిరీస్‌లో తలపడనుంది. స్పిన్ బౌలింగ్‌కు అనుకూలించే అక్కడి పిచ్‌లపై భారత బ్యాటర్లు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు టీమ్ మేనేజ్‌మెంట్ కీలక నిర్ణయం తీసుకుంది. యువ స్పిన్నర్లు విప్రాజ్ నిగమ్, తనుష్‌కొటియన్, హర్ష్ దూబె, శివాంగ్ కుమార్‌లను నెట్ బౌలర్లుగా ఎంపిక చేసింది. వీరు సోమవారం జట్టుతో పాటే శ్రీలంకకు వెళ్లారు. ఈ నలుగురు స్పిన్నర్లు టీమ్‌ఇండియా ఆటగాళ్లకు నెట్స్‌లో బౌలింగ్ చేస్తారు. ఇటీవల విప్రాజ్ నిగమ్ శ్రీలంకలో ఇండియా ఎ తరఫున ముక్కోణపు సిరీస్‌లో రాణించాడు. ఇక, లంక టూర్‌కు ఎంపికైన ప్రధాన జట్టులో రవీంద్ర జడేజా, కుల్‌దీప్ యాదవ్ వంటి అనుభవజ్ఞులైన స్పిన్నర్లు ఉన్నారు. వీరికి తోడుగా



మానవ్ సుతార్, సరాంశ్ జైన్ జట్టులో చేరారు. ఆగస్టు 7 నుంచి కొలంబోలో శ్రీలంక ఎలెవన్‌తో భారత్ మూడు రోజుల వార్మప్ మ్యాచ్ ఆడనుంది. తొలి టెస్టు గాలెలో ఈ నెల 15న మొదలవుతుంది. 23 నుంచి కొలంబోలో రెండో టెస్టు జరగనుంది.

# లుసానె డైమండ్ లీగ్ బరిలో నీరజ్ చోప్రా

ఇటీవల కామన్వెల్త్ క్రీడల్లో రజత పతకం సాధించిన భారత స్టార్ జావెలిన్ త్రో ప్లేయర్ నీరజ్ చోప్రా మరో పోటీకి సిద్ధమవుతున్నాడు. ఆగస్టు 21న జరగనున్న లుసానె డైమండ్ లీగ్‌లో అతడు బరిలోకి దిగనున్నాడు. ఈ ఏడాది డైమండ్ లీగ్ ఫైనల్స్‌లో నీరజ్ పోటీ పడాలంటే.. లుసానె టోర్నీ అతడికి అత్యంత కీలకం. బ్రసెల్స్ వేదికగా సెప్టెంబరు 45 తేదీల్లో డైమండ్ లీగ్ ఫైనల్స్ జరగనున్నాయి. దీనికి నీరజ్ ఇంకా



అర్హత సాధించలేదు. రబత్, రోమ్ లీగ్‌లకు దూరంగా ఉన్న అతడు.. జూన్‌లో జరిగిన దోహా డైమండ్ లీగ్‌లో జావెలిన్‌ను 85.69 మీటర్ల దూరం విసిరి నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నాడు. ప్రస్తుతం డైమండ్ లీగ్ ఫైనల్ పాయింట్ల పట్టికలో నీరజ్ ఐదు పాయింట్లతో ఏడో స్థానంలో ఉన్నాడు. ఫైనల్స్‌కు అర్హత సాధించాలంటే లుసానె లీగ్ లేదా ఆగస్టు 27న జరిగే జ్యూరిచ్ లీగ్‌లలో కనీసం ఒకదాంట్లోనైనా మెరుగైన ప్రదర్శన చేయాల్సి ఉంది. లుసానె పోటీల్లో రుమేశ్ తరంగ (శ్రీలంక), అర్షద్ నదీమ్ (పాకిస్థాన్), కెషోర్న్ వాల్కాట్ (ట్రినిడాడ్ అండ్ టొబాగో), అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా), జులియన్ వెబర్ (జర్మనీ), కర్టిస్ థాంప్సన్ (అమెరికా) నుంచి నీరజ్‌కు గట్టిపోటీ ఎదురుకానుంది. కామన్వెల్త్ గేమ్స్ 2026లో స్వర్ణం లక్ష్యంగా బరిలోకి దిగిన నీరజ్ ఆఖరిదాకా గట్టిగానే పోరాడినా.. అతడికి రజత పతకమే (85.83 మీ) లభించింది. రుమేశ్ పతిరగె 89.75 మీటర్ల త్రో వేసి స్వర్ణం ఎగరేసుకుపోయాడు.

# ఆ ఒక్కసారే కేఎల్ రాహుల్ కోపంగా ఉండటం చూశా: వసీం జాఫర్

భారత బ్యాటర్ కేఎల్ రాహుల్ వివాదాల జోలికి వెళ్లకుండా.. మైదానం లోపలా బయటా ప్రశాంతంగా ఉంటాడు. ఐపీఎల్‌లో పలు ఫ్రాంఛైజీలకు సారథిగా వ్యవహరించిన అతడు.. ఉత్కంఠభరిత మ్యాచ్‌ల్లోనూ కూల్‌గా ఉండటం మనం చూశాం. ఆటగాళ్లు తప్పులు చేసినా వారితో సౌమ్యంగా మాట్లాడుతాడు. అలాంటి రాహుల్.. ఓ సందర్భంలో కోపంగా ఉండటం చూశానని పంజాబ్ కింగ్స్ మాజీ హెడ్ కోచ్ వసీం జాఫర్ అన్నాడు. అతడు కోపగించుకోవడం అదే చివరిసారి కూడా అని తెలిపాడు. 2018-2021 వరకు పంజాబ్‌కు ప్రాతినిధ్యం వహించిన రాహుల్ కెప్టెన్‌గానూ సేవలదించాడు. ఆ సమయంలో పంజాబ్ కోచ్‌గా వసీం జాఫర్ ఉన్నాడు. 2020, 2021 సీజన్లలో ఆటగాడిగా రాహుల్ మంచి ప్రదర్శన చేసినప్పటికీ పంజాబ్ ఆరో స్థానంలో నిలిచింది. చాలా మ్యాచ్‌ల్లో గెలిచే స్థితిలో ఉండి కూడా చివరకు స్వల్ప తేడాతో పరాజయాలు చవిచూసింది. అది రాహుల్‌ను తీవ్ర నిరాశకు గురిచేసిందని జాఫర్ పేర్కొన్నాడు. "కేఎల్ సహజంగానే చాలా ప్రశాంతంగా ఉంటాడు. కాస్త మితభాషి. ఎవరితోనూ ఎక్కువగా కలవడు. అందుకే బయట పెద్దగా కనిపించడు. మైదానంలో గానీ, బయట గానీ అతడు సహనం కోల్పోవడం, కోప్పడటం చాలా అరుదు. కానీ నేను పంజాబ్ జట్టుకు కోచ్‌గా ఉన్నప్పుడు ప్రతి మ్యాచ్ కూడా తీవ్ర నిరాశను మిగిల్చింది. గెలిచే స్థితిలో ఉండి కూడా మేము మ్యాచ్‌లు ఓడిపోయాం. సునాయసంగా గెలవాల్సిన ఒక మ్యాచ్ చేజారడంతో రాహుల్‌కు కోపం వచ్చింది. ఆ రోజు అతడు తప్పుగా మాట్లాడలేదు. జట్టు ఆట తీరు పట్ల ఎంతగా అసహనానికి గురయ్యాడో స్పష్టంగా అర్థమైంది. రాహుల్‌ను కోపంగా చూసిన ఏకైక సందర్భం అదే'' అని వసీం జాఫర్ అన్నాడు.

# గాయాలతో బుమ్రా సతమతం.. గాబరా పడుతున్న టీమ్‌ఇండియా

జస్ప్రీత్ బుమ్రా.. ఈ పేసర్ బరిలోకి దిగుతున్నాడంటే ప్రత్యర్థి జట్ల బ్యాటర్ల గుండెల్లో గుబులు పుడుతుంది. స్వింగర్లు, యార్కర్లతో హడలెత్తించే పేస్ గుర్రాన్ని ఎదుర్కొవడానికి స్టార్ బ్యాటర్లు కూడా ఇబ్బందిపడతారు. ఇంతటి నాణ్యమైన బౌలర్ కీలకమైన మ్యాచ్‌లకు అందుబాటులో ఉండట్లేదు. అందుకు కారణం అతను వరుసగా గాయాల బారినపడటం. ఈ ఏడాది ఒక్క టెస్టు కూడా ఆడని బుమ్రా (Bumrah).. టీ20 ప్రపంచ కప్ ముగిశాక టీ20ల్లోనూ బరిలోకి దిగలేదు. ఐపీఎల్ తర్వాత నెలన్నరపాటు మైదానానికి దూరంగా ఉన్న అతను.. గత నెలలో ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌తో పునరాగమనం చేశాడు. అక్కడ రెండు మ్యాచ్‌లు ఆడి గాయం కారణంగా మూడో మ్యాచ్‌కు అందుబాటులో లేకుండా పోయాడు. ఆ గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో త్వరలో శ్రీలంకతో జరగనున్న రెండు టెస్టుల సిరీస్‌కు బుమ్రా దూరమయ్యాడు. 2016 జనవరిలో అరంగేట్రం చేసిన బుమ్రా ఇప్పటివరకు గాయం,



ఫిట్‌నెస్ సమస్యలతో ఏయే మ్యాచ్‌లు, సిరీస్‌లకు దూరమయ్యాడో ఓ లుక్కేద్దాం.



# మహిళలనే ఎందుకు టార్గెట్ చేస్తున్నారు..?

కన్నడ రాకింగ్ స్టార్ యశ్ హీరోగా, గీతు మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ చిత్రం 'టాక్సిక్' విడుదలకు ముందే భారీ అంచనాలను సొంతం చేసుకుంది. 'కేజీఎఫ్' సిరీస్ తర్వాత యశ్ నటిస్తున్న సినిమా కావడంతో దేశవ్యాప్తంగా ఈ చిత్రంపై ప్రత్యేక ఆసక్తి నెలకొంది. ఇటీవల విడుదలైన 'తబాహీ' పాట సోషల్ మీడియాలో మంచి స్పందన తెచ్చుకున్నప్పటికీ, అందులో హీరో యశ్, హీరోయిన్ కియారా అద్వానీ మధ్య ఉన్న కొన్ని ఇంటిమేట్ సన్నివేశాలు ఇప్పుడు పెద్ద చర్చకు దారితీశాయి. 'తబాహీ' పాట విడుదలైన తర్వాత సోషల్ మీడియాలో కియారా అద్వానీపై కొందరు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. వివాహం అయ్యాక, తల్లి అయిన తర్వాత ఇలాంటి సన్నివేశాల్లో నటించడం సరైందేనా అంటూ ప్రశ్నిస్తూ ఆమెను లక్ష్యంగా చేసుకుని ట్రోలింగ్ చేస్తున్నారు. కొందరు నెటిజన్లు ఆమె భర్త సిద్ధార్థ్ మల్హోత్రా సోషల్ మీడియా ఖాతాల్లోకి వెళ్లి కూడా అసభ్యకర వ్యాఖ్యలు చేయడం వివాదానికి దారితీసింది. అయితే ఇదే పాటలో నటించిన యశ్‌కు కూడా వివాహం అయ్యి పిల్లలు ఉన్నప్పటికీ, ఆయనపై మాత్రం ఎలాంటి విమర్శలు చేయకుండా ప్రశంసించడం గమనార్హం. ఈ ద్వంద్వ వైఖరిపై సినీ వర్గాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ఈ వివాదంపై తాజాగా స్పందించిన నటి హుమా ఖురేషి, మహిళలను మాత్రమే ఇలా టార్గెట్ చేయడం చాలా బాధాకరమని అన్నారు. ఒక నటిగా పాత్రలో భాగంగా చేసిన సన్నివేశాలను వ్యక్తిగత జీవితంతో ముడిపెట్టి విమర్శించడం చాలా దురదృష్టకరం. మహిళలనే ఇలా వేధించడం అసహ్యంగా ఉంది. ఇలాంటి విమర్శలకు మాటలతో సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. మా సినిమానే ప్రేక్షకులకు సరైన సమాధానం చెబుతుంది. ఆగస్టు 26న విడుదలయ్యే 'టాక్సిక్' అందరికీ జవాబు ఇస్తుంది అని ఆమె స్పష్టం చేశారు.



# 'వారణాసి' తర్వాత మహేష్ నెక్స్ట్ డైరెక్టర్ ఎవరు..?

సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రస్తుతం దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పాన్ వరల్డ్ చిత్రం 'వారణాసి' షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ అడ్వెంచర్ యాక్షన్ డ్రామాపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం చిత్రీకరణ తుది దశకు చేరుకోగా, ఇంకా కొద్ది రోజుల షూటింగ్ మాత్రమే మిగిలి ఉన్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో మహేష్ తదుపరి సినిమా ఎవరితో చేయబోతున్నారనే అంశం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. రాజమౌళి సినిమాలు పూర్తి చేయడానికి ఎక్కువ సమయం తీసుకుంటాయనే విషయం తెలిసిందే. అయితే 'వారణాసి' తర్వాత మహేష్ ఎలాంటి కథను ఎంచుకుంటారు? ఏ దర్శకుడికి గ్రీన్ సిగ్నల్ ఇస్తారు? అనే చర్చలు ఇప్పటికే ఇండస్ట్రీలో ఊపందుకున్నాయి. ముఖ్యంగా ఇద్దరు ప్రముఖ దర్శకుల పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. వారిలో మొదటగా వినిపిస్తున్న పేరు సందీప్ రెడ్డి వంగా. 'అర్జున్ రెడ్డి', 'యానిమల్' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలతో తనదైన ముద్ర వేసిన సందీప్ ప్రస్తుతం ప్రభాస్‌తో 'స్పిరిట్' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తైన తర్వాత మహేష్ బాబుతో సినిమా చేయాలని భావిస్తున్నట్లు, ఇప్పటికే కథా చర్చలు కూడా ప్రారంభమైనట్లు ప్రచారం సాగుతోంది. మహేష్ ఇమేజ్‌కు తగ్గట్టుగా పవర్‌ఫుల్ యాక్షన్ కథను సిద్ధం చేస్తున్నారనే వార్తలు అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. మరోవైపు యువ దర్శకుడు బుచ్చిబాబు సానా పేరు కూడా బలంగా వినిపిస్తోంది. 'ఉప్పెన'తో దర్శకుడిగా సంచలనం సృష్టించిన ఆయన, ఇటీవల రామ్ చరణ్‌తో తెరకెక్కించిన 'పెద్ది' సినిమాతో మరో భారీ విజయాన్ని అందుకున్నారని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఈ విజయంతో బుచ్చిబాబు మార్కెట్ మరింత పెరగడంతో, ఇప్పుడు మహేష్ బాబుకు సరిపోయే కథను సిద్ధం చేస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. గ్రామీణ నేపథ్యం, బలమైన భావోద్వేగాలు, కమర్షియల్ అంశాలను సమపాళ్లలో మేళవించే కథలను తెరకెక్కించడంలో బుచ్చిబాబు ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. అందుకే ఆయన చెప్పబోయే కథ మహేష్‌ను ఆకట్టుకునే అవకాశాలు ఉన్నాయని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం మహేష్ బాబు తదుపరి ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ సందీప్ రెడ్డి వంగా, బుచ్చిబాబు సానా పేర్లు బలంగా వినిపిస్తుండటంతో అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. 'వారణాసి' విడుదల అనంతరం మహేష్ తన తదుపరి సినిమాపై స్పష్టత ఇచ్చే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి. అయితే ఇప్పటివరకు ఈ రెండు కాంబినేషన్లపై చిత్రబృందాలు లేదా మహేష్ బాబు నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో అభిమానులు అధికారిక ప్రకటన కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# నాని సమర్పణలో నితిన్ కొత్త చిత్రం..



హీరోగా వరుస విజయాలతో దూసుకుపోతూనే, అభిరుచి గల చిత్రాలను నిర్మిస్తూ నిర్మాతగానూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నాడు నేచురల్ స్టార్ నాని. ఇప్పుడు మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. తాజాగా నాని సమర్పణలో హీరో నితిన్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న కొత్త చిత్రానికి 'అలియాస్ రుక్మిణీ' అనే విభిన్నమైన టైటిల్‌ను ఖరారు చేస్తూ చిత్రబృందం ప్రత్యేక గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతూ సినీ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రానికి యువ దర్శకుడు మురళీకాంత్ దర్శకత్వం వహిస్తున్నారు. కథలో కొత్తదనం, ఆసక్తికరమైన కాన్సెప్ట్ ఉన్నట్లు టైటిల్ గ్లింప్స్ ద్వారా మేకర్స్ హింట్ ఇచ్చారు. ముఖ్యంగా ఈ వీడియోకు నాని అందించిన వాయిస్ ఓవర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గ్లింప్స్ ప్రారంభంలో నితిన్ ఇంజినీరింగ్ పుస్తకాల మధ్య నిద్రపోతూ కనిపిస్తాడు. అయితే అతని ముందు కనిపించే పుస్తకాల పేర్లు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. 'గరం గోపాల్', 'ఆమెకు ఆమెంటే ఇష్టం', 'వత్రం వెంకన్న' వంటి వినూత్న శీర్షికలతో ఉన్న పుస్తకాలను చూపిస్తూ వాటి రచయితగా 'రుక్మిణి' అనే పేరును ప్రస్తావిస్తారు. దీంతో ఈ రుక్మిణి ఎవరు? అనే ఆసక్తి ప్రేక్షకుల్లో పెరుగుతుంది. ఆ సమయంలో నాని వాయిస్ ఓవర్‌లో రుక్మిణి గురించి వివరిస్తుండగా, చివర్లో నితిన్ "ఆమె నా భార్య" అని చెప్పడం గ్లింప్స్‌కు ఆసక్తికర ముగింపునిచ్చింది. ఈ ఒక్క డైలాగ్‌తోనే సినిమా కథపై మరింత క్యూరియాసిటీ పెరిగింది. 'అలియాస్ రుక్మిణి' అనే టైటిల్ వెనుక ఉన్న రహస్యం ఏమిటి? రుక్మిణీ పాత్ర కథలో ఎంత కీలకమనే అంశాలపై చర్చ మొదలైంది

# 'కాసుల కళ వేరే అంట.. అవి పూసుకు తిరగాలంటా'..



రమణారెడ్డి సోమ డైరెక్ట్ చేస్తున్న యూత్‌ఫుల్ కామెడీ ఎంటర్‌టైనర్ అమీర్ లోగ్ (Ameer Log). ఎంసీ హరి, మనోజ్, శశిధర్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న ఈ చిత్రంలో వేదా జలంధర్, రావణ్ నిట్టూరు, విశ్వేందర్ రెడ్డి, సాయి యోగి ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఆగస్టు 21న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా ఈ మూవీ నుంచి విడుదల చేస్తున్న ఒక్కో పాట సెపరేట్ స్టైల్‌లో సాగుతూ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి. తాజాగా మేకర్స్ కాసుల కళ అంటూ సాగే లిరికల్ వీడియో సాంగ్‌ను లాంచ్ చేశారు. రెక్కలు కదలాడందే చిక్కులు విడిపోవంట లెక్కలు సరితూగే వేళ.. పిక్కలు పరుగాడందే డొక్కలు నిదరోవంట.. కాసుల కళ వేరే అంటా.. అవి పూసుకు తిరగాలంటా అనే లిరిక్స్‌తో హైదరాబాద్‌లో కాసులు సంపాదనలో పడే కష్టాలు ఎలా ఉంటాయో కండ్లకు కట్టినట్టు చూపించనున్నట్టు విజువల్స్‌తో హింట్ ఇచ్చేశాడు డైరెక్టర్. ఈ సాంగ్‌కు హైదరాబాదీలంతా కనెక్ట్ అవడం గ్యారంటీ అని లిరిక్స్ చెప్పకనే చెబుతున్నాయి. కాసుల కళ.. ఒకపాట కాదు.. మన జీవితంలో చాలా మందికి కనెక్ట్ అయ్యే ఒక ఎమోషన్ అంటూ రిలీజ్ చేసిన ఈ పాటపై మీరూ ఓ లుక్కేయండి. ఇప్పటికే ఈ మూవీ నుంచి విడుదల చేసిన అవ్వల్ దావత్ సాంగ్‌తోపాటు హైదరాబాదీ ర్యాప్ స్టైల్‌లో సాగే 'సీదా హెలికాప్టర్ షాట్' సాంగ్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. అమీర్ లోగ్ తెలుగు రాష్ట్రాల పంపిణీ హక్కులను టాలీవుడ్ యాక్టర్ రానాకు చెందిన స్పిరిట్ మీడియా సొంతం చేసుకుంది. హైదరాబాద్ గల్లీ బ్యాక్‌డ్రాప్‌లో ముగ్గురు స్నేహితుల మధ్య కథ నేపథ్యంలో కామెడీతోపాటు కంటెంట్‌ను నమ్మి వస్తున్న మూవీని అవ్వల్ నంబర్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై మాధవి రెడ్డి సోమ తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి స్మరణ్ సాయి సంగీతం అందిస్తున్నాడు.



# ఇండస్ట్రీలో టాప్ సింగర్..

ఆ అందాల సింగర్, బాలీవుడ్ స్టార్ బ్యూటీ నేహా కక్కర్. ఉత్తరాఖండ్ ప్రాంతానికి చెందిన నేహా కక్కర్.. కుటుంబంతో కలిసి ఢిల్లీకి మకాం మార్చింది. చిన్న వయసులోనే పాటలు పాడడం ప్రారంభించింది నేహా కక్కర్. చిన్నప్పటి నుంచే అనేక కచేరీలలో పాటలు పడింది. ఆమె సోదరి సోను కక్కర్‌తో కలిసి ఆలయాల్లో భజనలు, కీర్తనలు కూడా ఆలపించింది ఈ అమ్మడు. అయితే చిన్నవయసులోనే నేహా కక్కర్ కుటుంబం ఎన్నో ఆర్థిక సమస్యలను ఎదుర్కొంది. ఆమె తండ్రి రిషికేశ్‌లో తాను, తన సోదరి చదివిన పాఠశాల ముందు సమోసాలు అమ్మేవాడని గతంలో నేహా కక్కర్ ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. ఆ ఆర్థిక కష్టాల నుంచి బయటపడటానికి చాలా సమయం పట్టిందని తెలిపింది. ఇక ప్రస్తుతం నేహా ఆస్తుల విలువ రూ. 65కోట్లకు పైగానే ఉన్నాయని తెలుస్తుంది. నేహా కక్కర్ 2005 సంవత్సరంలో 'ఇండియన్ ఐడల్' సీజన్ 2 షోతో తన కెరీర్‌ను ప్రారంభించింది. ఆ తర్వాత, ఆమె అనేక బాలీవుడ్ పాటలు పాడింది. ప్రస్తుతం బీటౌన్ ఇండస్ట్రీలో టాప్ సింగర్‌గా స్థానం సంపాదించుకుంది. నెట్టింట కూడా ఈ ముద్దుగుమ్మకు భారీ ఫాలోయింగ్ ఉంది. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ క్రేజీ ఫోటోలు, వీడియోలతో అభిమానులను ఆకట్టుకుంటుంది ఈ ముద్దుగుమ్మ.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.